రేపటి నుండి ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకలు

: జిల్లా టూరిజం అధికారి

విశాలాంధ్ర-తిరుపతి : ప్రపంచ పర్యాటక దినోత్సవం ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 27 తిరుపతిలో పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జిల్లా పర్యాటక మరియు సాంస్కృతిక అధికారి రూపేంద్రనాద రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 27 న బుధవారం ఉదయం 7.00 రామానుజ సర్కిల్ నుండి శిల్పారామం వరకు 2కె రన్ , సాయంత్రం శిల్పారామంలో 6.30 గంటలకు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, వివిధ రంగాల్లో సేవలందించిన వారికి ప్రసంశా పత్రాలు, మెమెంటోలు అందించడం జరుగుతుందని ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్ , ఎస్.పి., అధికారులు హాజరుకానున్నారని ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని టూరిజం అధికారి ఆ ప్రకటనలో తెలియజేసారు.

ఘనంగా పండిట్ దీనదయాల్ ఉపాధ్యాయ జయంతి వేడుకలు

విశాలాంధ్ర- సత్యవేడు: సత్యవేడు పట్టణంలో పండిట్ దీన దయాల్ ఉపాధ్యాయ జయంతి వేడుకలను బిజెపి నాయకులు పలువురు ఘనంగా జరుపుకున్నారు.సోమవారం బిజెపి మండల అధ్యక్షులు మునిప్రతాప్ ఆధ్వర్యంలో బిజెపి నాయకులు దీనదయాల్ ఉపాధ్యాయ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు మునిప్రతాప్ మాట్లాడుతూ జనసంగ్ ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు తీసుకుని శ్యాంప్రసాద్ ముఖర్జీ మరణాంతరం పూర్తిస్థాయిలో పార్టీ బాధ్యతలు తీసుకోని ఏకాత్మాకవాధ సిద్ధాంతంతో ముందుకెళ్లారని తెలిపారు.ప్రతి ఒక్క అట్టడుగు వర్గానికి మేలుచేకూరేలా ఆయన తీసుకున్న నిర్ణయాలు ప్రస్తుతం ఎందరికో మేలుచేకూర్చాయని పేర్కొన్నారు. భారతీయ జనతాపార్టీ ప్రపంచంలోనే అత్యధిక సభ్యత్వం కలిగిన పార్టీగా రూపాంతరం చెందిందంటే ఆయన అవలంభించిన విధానాలే కారణమన్నారు. భవిష్యత్లోను వాటిని పాటించి ఆయన బాటలో పయనించి పార్టీని మరింత ముందుకు తీసుకెళ్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ మోర్చా తిరుపతి జిల్లా అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి మునికృష్ణయ్య, వాసు,మండల ప్రధాన కార్యదర్శిలు మురళి, బుజ్జిబాబు, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు చెంచయ్య,సీనియర్ నాయకులు వెంకటేశ్వర్లు రెడ్డి, మోహన్ బాబు, రాజేంద్ర, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

షార్‌లో ఘనంగా సతీష్ ధావన్ జయంతి వేడుకలు

విశాలాంధ్ర - సూళ్లూరుపేట: సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ షార్ లో సోమవారం అంతరిక్ష పరిశోధనల పితామహుడు ప్రొఫెసర్ సతీష్ ధావన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు,షార్ సెంటర్ లోని సెకండ్ గేటు తరువాత ఉన్న సతీష్ ధావన్ విగ్రహానికి షార్ డైరెక్టర్ రాజరాజన్ ఆర్ముగం చేతులు మీదుగా పూలు వేసి ఘన నివాళులు అర్పించారు, ఆయన తో పాటు గా షార్ లోని వివిధ విభాగాలకు చెందిన డిప్యూటీ డైరెక్టర్ లు ,అసోసియేట్ డైరెక్టర్ ,కంట్రోలర్ తో పాటు ఇతర ఇస్రో ఉన్నతాధికారులు కూడా జయంతి వేడుకలో పాల్గొన్నారు, అలాగే సూళ్లూరుపేట లోని సతీష్ ధావన్ మెమోరియల్ హాస్పిటల్ లో కూడా సతీష్ ధావన్ చిత్రపటానికి షార్ డైరెక్టర్ రాజరాజన్ చేతులమీదుగా పుష్పాలు వేసి నివాళి అర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అసోసియేట్ డైరెక్టర్ గోపికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ కుట్రలు, కుతంత్రాలు ఇక సాగవు

-మాజీ ఆయకట్టు ప్రెసిడెంట్ కైలాసం గోపాల్ రెడ్డి

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: వైసీపీ చేస్తున్న కుట్రలు కుతంత్రాలు ఇక ప్రజల ముందు సాగవని... ప్రజలు తిరుగుబాటుకు సిద్ధమయ్యారని దుర్గిపేరి మాజీ ఆయకట్టు సర్పంచ్ కైలాసం గోపాల్ రెడ్డి అన్నారు.. ఏర్పేడు మండలం నచ్చనేరి పంచాయతీ దుర్గిపేరిలో చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా సోమవారం సాయంత్రం కొవ్వొత్తులతో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. బాబుకు తోడుగా నేను అనే కార్యక్రమంలో భాగంగా ఈ కొవ్వొత్తుల నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కైలాసంగోపాల్ రెడ్డి మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రానికి 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తి... నిత్యం ప్రజల్లో ఉంటున్న ప్రజానాయకుడు తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడన్నారు. అటువంటి పెద్దాయనను కనీసం వయసు కూడా చూడకుండా అక్రమ కేసులు పెట్టి ఈ సైకో ముఖ్యమంత్రి సబ్ జైల్లో పెట్టడం జరిగిందన్నారు. చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా రోడ్డుపైకి వచ్చి శాంతియుతంగా నిరసన తెలుపుతున్న తెలుగుదేశం పార్టీ నాయకులు మీద కూడా పోలీసులు కేసులు బనాయించి సబ్ జైల్లో పెట్టి బాధించడం జరిగిందన్నారు. ఇవన్నీ సామాన్య ప్రజలు చూస్తూ ఉన్నారని గుర్తు చేశారు. ప్రభుత్వం మీద తిరుగుబాటు చేయడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.. వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయం తథ్యమని చెప్పారు. అనంతరం దుర్గి పేరి గ్రామంలో కొవ్వొత్తులతో ఏర్పేడు వెంకటగిరి రహదారి నుండి రాములవారి గుడి వరకు ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో సుబ్రహ్మణ్యం రెడ్డి ,తిరుపాల్ రెడ్డి, మునిరత్నం రెడ్డి, కెవి రమణ, మునిమానందరెడ్డి, మునీంద్ర బాబు ,గణేష్ ,శేషాద్రి, శ్రీనివాసులు ,శేఖర్ రెడ్డి, హరి రెడ్డి ,బాబు రెడ్డి ,ముని రామయ్య తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయిలో జిల్లా ఖ్యాతిని నిలబెట్టాలి:ఎంపిడివో

విశాలాంధ్ర - బుచ్చినాయుడు కండ్రిగ : క్రీడలు ఒకరి శారీరక ఆరోగ్యంతో పాటు సానుకూల ఫలితాలను ఇస్తు మానసిక ఉల్లాదానికి తోడ్పడుతాయని ఎంపీడీవో డి నరసింహా రావు పేర్కొన్నారు, మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో సోమవారం ఎంపీపీ మేకల సుబ్బలక్ష్మి ఆధ్వర్యంలో జిల్లా హ్యాండ్ బాల్ పోటీలును ప్రధానోపాధ్యాయుడు కే రమణయ్య అధ్యక్షతన జిల్లా క్రీడా అధికారుల సమక్షంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో నరసింహారావు మాట్లాడుతూ క్రీడలు మనిషికి శక్తి తో పాటు వ్యాయామం మనోరంజక సాధనాలలో ముఖ్యభాగమై పోయిందన్నారు, సాంప్రదాయకమైన ఆటల కంటే, ఆధునిక ప్రపంచగుర్తింపుగల పోటీ ఆటలలో ప్రావీణ్యం సాధిస్తే పేరు, ప్రతిష్ఠలతో పాఠశాలకు ఉపాధ్యాయులకు గౌరవం పెరుగుతుందన్నారు క్రీడలు సాధారణంగా శారీరక సామర్థ్యంపై క్రీడలపై ఆధారపడి ఉంటుందన్నారు. అనంతరం తిరుపతి జిల్లా డీఈవో శేఖర్ బాబు మాట్లాడుతూ జిల్లా స్థాయిలో బాలురు బాలికలు క్రీడలలో సాధన తోనే ఉన్నత స్థాయికి వెళ్లడానికి దోహదపడుతుందన్నారు,క్రీడాకారుల శ్రమ భౌతిక సంఘటనల ద్వారా గెలుపును నిర్ణయించవచ్చు. ఇప్పుడు సాంకేతిక పనితీరు మెరుగుపడిందన్నారు. జిల్లాస్థాయి ఎంపికలో అండర్ 14 విభాగములో బాలికల 16 మంది, బాలురు అండర్ 14, విభాగంలో 16 మంది ఎంపికయ్యారు, అండర్ 17 బాలికల విభాగంలో 16 మంది, బాలుర అండర్ 17 విభాగంలో 16 మంది విద్యార్థులు ఎంపికయ్యారు తెనాలిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు 32 మంది విద్యార్థులను పాల్గొనుటకు అర్హత ఎంపిక చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ కుమార్, మండల విద్యాశాఖ అధికారులు కే రవీంద్రనాథ్, ఆవుల సుబ్రహ్మణ్యం లు, తిరుపతి జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి విజయ్ కుమారి బి ఎన్ కండ్రిగ పంచాయతీ సర్పంచ్ బి వెంకటమ్మ, ఉప సర్పంచ్ కేఎం రాజాఫిజికల్ డైరెక్టర్ కిషోర్, మస్తాన్,హరిబాబు, పాల్గొన్నారు

అంగన్వాడీ సమస్యలను అడిగితే అరెస్ట్ చేస్తారా

విశాలాంధ్ర-పలమనేరు :అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ న్యాయమైన సమస్యలను అడగడానికి వెళితే అక్రమ అరెస్టులు చేయడం సరికాదని సమరశీల అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ నియోజకవర్గం అధ్యక్ష కార్యదర్శులు సరస్వతి, సుబ్బమ్మ, చిలకమ్మా ప్రభుత్వాన్ని నిలదీశారు. అందులో భాగంగా సోమవారం పలమనేరు తాసిల్దార్ కార్యాలయం ముందు అక్రమ అరెస్టులను నిరసిస్తూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షురాలు సరస్వతి మాట్లాడుతూ గతంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాదయాత్ర సందర్భంగా అంగన్వాడి సమస్యలను పరిశీలించి పరిష్కరిస్తానని చెప్పి ఇంతవరకు ఎటువంటి పురోగతి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన మెమొరండాను తహసిల్దార్ కుప్పస్వామికి అందజేశారు. ఈ కార్యక్రమంలో నిర్మల, భారతి, నాగరత్న, పరిమళ,విజయమ్మ, సులోచన, మానవ హక్కుల నాయకులు మణి, శ్రీనివాసులు, ఆనంద, పాండురంగాచారి, రామస్వామి, తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి లయన్స్ క్లబ్బు ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాన్ని ఏర్పాటు

విశాలాంధ్ర -తిరుపతి : సోమవారం రోజున తిరుపతిలోని స్థానిక నగరపాలక ప్రాథమిక పాఠశాల పట్నాలు వీధి నందు తిరుపతి లయన్స్ క్లబ్బు అధ్యక్షులు బి .మునికృష్ణ నాయుడు ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆ పాఠశాల వార్డు కార్పొరేటర్ బసవ గీత గారు విచ్చేసి సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యంగా పనిచేస్తున్నది అన్నారు. అందులో భాగంగా విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను ఉచితంగా విద్యార్థులకు అందించడం జరుగుతుందన్నారు. అదేవిధంగా నాడు నేడు కార్యక్రమం ద్వారా పాఠశాలలకు అవసరమైన మౌలిక వసతులు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు ఉచితంగా విద్యా సామాగ్రి అందించడం చాలా సంతోషదాయకమన్నారు. ఈ కార్యక్రమానికి దాతలు రాజేంద్రప్రసాద్, ఎమ్మార్ రాజాలు ఉచితంగా విద్యా సామాగ్రి వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో బసవా బాలసుబ్రమణ్యం. క్లబ్ సెక్రటరీ ముబారక్ బాషా, ట్రెజరర్ వినోద్ వెంకటాచలం ,జిల్లా అదనపు కార్యదర్శి డాక్టర్ కె .రాజేంద్రప్రసాద్, ఎం ఆర్ రాజా, కస్పా పద్మనాభం, లోకేష్ బాబు, పాఠశాల ఉపాధ్యాయులు జయంతి, హేమమాధురి, కృష్ణవేణి, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదులపై అలసత్వం వద్దు:కమిషనర్
సమస్యల పరిష్కారానికే స్పందన:మేయర్

విశాలాంధ్ర - తిరుపతి: సమస్యల పరిష్కారానికే స్పందన నిర్వహిస్తున్నామని, స్పందనను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ మేయర్ డాక్టర్ శిరీష అన్నారు. ప్రజా పిర్యాధుల పట్ల అలసత్వం చూపకుండా సకాలంలో పరిష్కరించేలా అధికారులు తగు చర్యలు చేపట్టాలని తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ హరిత ఐఏఎస్ తెలిపారు. తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం డయల్ యువర్ కమిషనర్, అర్జీలు స్వీకరించే స్పందన కార్యక్రమంలో మేయర్ డాక్టర్ శిరీష పాల్గొనగా, కమిషనర్ హరిత అర్జీలను స్వీకరించారు. ఎన్జీవో కాలనీ వద్ద ఎటువంటి అనుమతులు లేకుండా టీ షాపు ఏర్పాటు చేసారనే పిర్యాదుపై కమిషనర్ స్పందిస్తూ వెంటనే ఆ షాపును పరిశీలించి అనుమతులు వున్నాయా లేవా అని పరిశీలించాలని, స్థలం అక్రమణకు గురై వుంటె తొలగించాలని అధికారులకు తగు సూచనలు జారీ చేసారు. సోమవారం డయల్ యువర్ కమిషనర్ కు 17, స్పందనకు 22 పిర్యాధులు అందగా, వాటిలో ముఖ్యంగా కొత్తపల్లి ప్రాంతంలో కాలువలు, రోడ్లు, తెలుగుగంగ లైన్ ఏర్పాటు చేయాలని, తిలక్ రోడ్డులో స్పీడ్ బ్రేకర్ ఎత్తు పెంచాలని, గాంధీపురం, న్యూ ఇందిరానగర్ ప్రాంతాల్లో తెలుగుగంగ నీరులో డ్రైనేజ్ కలుస్తున్నదని, సుభాష్ నగర్, మారుతీ నగర్లో చెట్టు కొమ్మలు తొలగించాలని, వరదరాజనగర్ పెట్రోల్ బంక్ ప్రక్కనున్న 60 అడుగుల రోడ్డులో 40 అడుగుల రోడ్డు వేయడంతో రోడ్డు ప్రక్కన బంకులు, వాహనాలు పార్కింగ్ వలన ఇబ్బందిగా వుందని, సున్నపువీధి వద్ద మ్యాన్ హోల్ పై కవర్ ఏర్పాటు చేయించాలని, కొన్ని ఏరియాల్లో డ్రైనేజి సమస్యలపై వచ్చిన పిర్యాధులపై కమిషనర్ స్పందిస్తూ పిర్యాధుల పరిష్కారానికి సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకోని సకాలంలో పరిష్కరించాలని తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ హరిత ఐఏఎస్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, మునిసిపల్ ఇంజనీర్లు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, రెవెన్యూ అధికారులు కె.ఎల్.వర్మ, సేతుమాధవ్, సెక్రటరీ రాధిక, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్వేష్ రెడ్డి, సిటీ ప్లానింగ్ అధికారులు శ్రీనివాసులు రెడ్డి, బాలసుబ్రమణ్యం, వెటర్నరీ ఆఫీసర్ డాక్టర్ నాగేంద్ర రెడ్డి, మేనేజర్ చిట్టిబాబు, సర్వేయర్ దేవానంద్, సూపర్డెంట్లు, డిఈలు, ఆర్.ఐలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి రథోత్సవం

- గోవింద నామ స్మరణలతో రథాన్ని లాగిన భక్తులు

విశాలాంధ్ర - తిరుమల : తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలలో ఎనిమిదో రోజు సోమవారం ఉదయం 6.55 నుండి 9 గంటల నడుమ ఉభయదేవేరులతో కూడిన శ్రీమలయప్పస్వామివారి రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని గోవింద నామ స్మరణలతో స్వామివారి రథాన్ని లాగారు. బ్రహ్మోత్సవాలలో ఎనిమిదో రోజున ఉభయ దేవేరులతో మలయప్పస్వామిని మహోన్నత రథంపై అధిష్ఠింపజేసి ఆలయ వీధులలో విహరింపజేశారు. శ్రీవారికి భక్తులు అడుగడుగునా కర్పూర హారతులతో నీరాజనాలు సమర్పించారు. గోవిందనామస్మరణతో ఆలయ మాడవీధులు మారుమోగాయి. అనాదికాలం నుండి రాజులకు రథసంచారం ప్రసిద్ధం. యుద్ధాలలో కూడా విరివిగా రథసంచారం జరిగినట్లు భారతాది గ్రంథాలు వివరిస్తున్నాయి. శ్రీహరి గరుడధ్వజుడై నాలుగు గుర్రాలతో కూడిన రథంపై విహరిస్తాడు. ఇక ప్రసిద్ధ దేవాలయాలలో ఉత్సవవేళలో దేవుని ఉత్సవమూర్తిని రథంపై ఉంచి ఊరేగించే ఆచారం, ఆగమశాస్త్ర సిద్ధమై బహుళ ప్రచారంలో ఉంది. తిరుమలలో రథోత్సవం అన్నివిధాలా ప్రసిద్ధమైంది. "రథస్థం కేశవం దృష్ట్వా పునర్జన్మనవిద్యతే" అన్న ఆర్షవాక్కులురథోత్సవంమోక్షప్రదాయకమని వివరిస్తున్నాయి. తిరుమాడ వీధులలో రథాన్ని లాగేటప్పుడు ప్రమాదాలు జరుగకుండా అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. రథానికి తాళ్ళుకట్టి వీధులలో భక్తులు, అధికారులు అందరూ రథాన్ని ముందుకు లాగారు.రథోత్సవానికి విశిష్టమైన ఆధ్యాత్మికార్థం ఉంది. కఠోపనిషత్తులో ఆత్మకు, శరీరానికీ ఉండే సంబంధాన్ని రథరూపకల్పనతో వివరించడం జరిగింది. ఆత్మ రథికుడు, శరీరమే రథం, బుద్ధి సారథి, మనస్సు పగ్గం, ఇంద్రియాలే గుర్రాలు, విషయాలే వీధులు. ఈ రీతిలో శరీరాన్ని రథంతో పోల్చడంతో - స్థూలశరీరం వేరనీ, సూక్ష్మశరీరం వేరనీ, ఆత్మ అందుకు భిన్నమనే ఆత్మానాత్మ వివేకం కలుగుతుంది. రథోత్సవంలో ముఖ్యంగా కలిగే తత్త్వజ్ఞానమిదే. భక్తులు రథాన్ని లాగుతారు, కానీ, అన్నమయ్య సకలజీవులలో అంతర్యామిగా ఉన్న పరమాత్మ తనరథాన్ని తానే లాగుతున్నాడని అనడం సముచితం. ఈ కార్యక్రమంలో శ్రీ పెద్దజీయర్‌స్వామి, శ్రీ చిన్నజీయర్‌స్వామి, టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి దంపతులు, ఈవో ఎవి.ధర్మారెడ్డి దంపతులు, రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఢిల్లీ స్థానిక సలహా మండలి అధ్యక్షురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, పలువురు బోర్డు సభ్యులు, జెఈవోలు సదా భార్గవి, వీరబ్రహ్మం, సివిఎస్వో నరసింహ కిషోర్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

నేటి చక్రస్నానంతో శ్రీవారి బ్రహ్మోత్సవాలు పరిసమాప్తం

- ఏర్పాట్లు పూర్తి - పుష్కరిణి స్నానం రోజంతా పవిత్రమే

విశాలాంధ్ర - తిరుమల : ఎనిమిది రోజులపాటు అంగరంగ వైభవంగా జరిగిన శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు చివరి రోజైన సెప్టెంబరు 26న జరగనున్న చక్రస్నానంతో పరిసమాప్తం కానున్నాయి. ఇందుకోసం టిటిడి శ్రీవారి పుష్కరిణిలో ఏర్పాట్లు పూర్తిచేసింది. ఉదయం 6 నుండి 9 గంటల వరకు శ్రీ వరాహస్వామివారి ఆలయం వద్దగల స్వామి పుష్కరిణిలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారికి, శ్రీ చక్రత్తాళ్వార్‌కు స్నపనతిరుమంజనం, ఆ తరువాత చక్రస్నానం నిర్వహిస్తారు. ఇందుకోసం భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పుష్కరిణిలో గ్యాలరీలు, స్నానఘట్టాలు ఏర్పాటుచేశారు. భద్రతాపరంగా ఇబ్బందులు లేకుండా టీటీడీ భద్రతా సిబ్బందితోపాటు ఎస్‌పిఎఫ్ సిబ్బంది, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచారు. చక్రస్నానం పవిత్రత రోజంతా ఉంటుందని, భక్తులు సంయమనం పాటించి పుష్కరిణిలో స్నానం చేయాలని టీటీడీ కోరుతోంది. భక్తులు దుస్తులు మార్చుకునేందుకు కూడా ఏర్పాట్లు చేశారు. అధికారులకు జేఈవో అభినందించినలు : శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో మాడ వీధులు, బయటి క్యూలైన్లు, ఇతర సెక్టార్లలో బాధ్యతలు అప్పగించిన టీటీడీ అధికారులు, ఉద్యోగులు టీమ్‌వర్క్‌తో చక్కగా పనిచేశారని టీటీడీ జేఈవో వీరబ్రహ్మం అభినందించారు. తిరుమలలో సోమవారం జరిగిన సెక్టోరల్ అధికారుల సమావేశంలో జెఈవో మాట్లాడుతూ గరుడసేవ విజయవంతానికి అధికారులందరూ అంకితభావంతో పనిచేశారని కొనియాడారు. మరో 20 రోజుల వ్యవధిలో జరగనున్న నవరాత్రి బ్రహ్మోత్సవాలకు కూడా ఇదే స్ఫూర్తితో పని చేయాలని కోరారు. అనంతరం నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు అన్ని సెక్టోరల్ అధికారుల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకున్నారు.ఈ సమావేశంలో ఎస్వీబీసీ సీఈఓ షణ్ముఖ్ కుమార్, ఎస్ఇ-2 జగదీశ్వర్ రెడ్డి, సెక్టోరల్ అధికారులుగా ఉన్న సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులను పర్మినెంట్ చేయాలి

సిఐటియు డిమాండ్

విశాలాంధ్ర - గూడూరు : గూడూరు ఏపి మున్సిపల్‌వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీ యు రాష్ట్ర కమిటి ఇచ్చిన పిలుపు మేరకు గూడూరు లోని మాయాబజార్ సిఐటియు కార్యాలయం నుండి మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు ర్యాలీగా బయలు దేరి ముత్యాలపేట మీదుగా ఆర్డీఓ కార్యాలయానికి చేరుకుని ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి రాకముందు రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులను, నేను అధికారంలోకి వచ్చిన వెంటనే పర్మినెంట్ చేస్తానని వాగ్దానం చేసి నాలుగున్నరేళ్ళు దాటిపోతున్నా వారి పట్ల ఏ విధమైన న్యాయం చేయలేదన్నారు. మున్సిపల్ కార్మికులకు క్రమబద్ధీకరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. అసెంబ్లీ సమావేశాలలో చర్చలు జరిపి మున్సిపల్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ లో పని చేస్తున్న కార్మికులను అందరిని వెంటనే పర్మినెంటు చేయాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం గూడూరు పట్టణ శాఖ కార్యదర్శి జోగి శివకుమార్, ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ పట్టణ కార్యదర్శి దారా కోటేశ్వరరావు, మున్సిపల్ శ్రామిక మహిళా అధ్యక్షు రాలు బి. ప్రభావతి, సిబిటియు పట్టణ అధ్యక్షులు బివి. రమణయ్య, ప్రధాన కార్యదర్శి ఎస్. సురేష్, కెవిపిఎస్ నాయకులు అడపాల ప్రసాద్, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు పి. శంకరయ్య, జి. మధు, జిల్లా కమిటి సభ్యులు బి. పెంచల ప్రసాద్, ఆర్. సుబ్బమ్మ, కె. నారాయణమ్మ, సుబ్బరామమ్మ, తదితరులు పాల్గొన్నారు.

వేటగానికి రిమాండ్

విశాలాంధ్ర - సోమల : సోమల మండలం, అన్నమగారి పల్లి పంచాయతీ, బోనమందకు చెందిన సుబ్రహ్మణ్యం, తండ్రి: దొరస్వామి అను అతను 2020 వ సంవత్సరంలో బోనమంద అటవీ ప్రాంతంలో అడవి జంతువులను చంపడానికి కరెంటు వైర్లు తీసినాడని కేసు నమోదు చేయగా, ఆ కేసులో సుబ్రమణ్యం కోర్టుకు వెళ్ళనందున కోర్టు నుండి వచ్చిన అరెస్టు వారెంట్ మేరకు సుబ్రహ్మణ్యంను తీసుకొని వెళ్లి చిత్తూరు జిల్లా కోర్టు నందు హాజరుపరచగా, మెజిస్ట్రేట్ వారు సుబ్రమణ్యంకు ఈరోజు నుండి అనగా 25.09.2023 నుండి 03.10.2023 వ తేదీ వరకు రిమాండ్ చేయగా, సోమల పోలీసు వారు అతనిని చిత్తూరు జిల్లా జైలుకు పంపించినట్లు సోమల సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ వెంకట నరసింహులు తెలిపారు.

శాసనమండలి ప్రివిలేజ్ కమిటీ సభ్యునిగా బల్లి కళ్యాణ్ చక్రవర్తి

విశాలాంధ్ర - గూడూరు : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనమండలికి శాసనమండలి చైర్మన్ కొయ్య మోహన్ రాజు ఆధ్వర్యంలో కమిటీలు ఏర్పాటు చేశారు. శాసనమండలి ప్రివిలేజ్ కమిటీ సభ్యునిగా రాష్ట్ర ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్ చక్రవర్తిని నియమించారు. ఈ కమిటీకి చైర్మన్ గా ఎమ్మెల్సీ ఎల్లారెడ్డి శివరాం రెడ్డి, కమిటీ సభ్యులుగా దువ్వాడ శ్రీనివాస్, తూమాటి మాధవరావు, కేవిస్ లక్ష్మణరావులను నియమించారు.

దీన దయాల్ సేవలు మరువలేనివి

-బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: పండిట్ దీనదయాల్ సేవలు మరువలేనవని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ అన్నారు. దీనదయాల్ జయంతి వేడుకలు సోమవారం శ్రీకాళహస్తిలోని పాత మద్రాసు బస్టాండ్ కూడలిలో పట్టణ అధ్యక్షులు గరికపాటి రమేష్ బాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ వేడుకలకు కోలా ఆనంద్ హాజరయ్యారు. దీనదయాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కోలా ఆనంద్ మాట్లాడుతూ... దీనదయాల్ ఉపాధ్యాయ రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్, భారతీయ జనసంఘ్ అధినేతగా పాశ్చాత్య మూలాలకు చెందిన బ్రిటీష్ వ్యవస్థను పూర్తిగా వ్యతిరేకించరన్నారు. దేశ ప్రజలు కోసం ఉపయోగపడే ప్రజాస్వామ్య వ్యవస్థను సృష్టించడం కోసం గట్టిగా ఉద్యాటించారని కోలా ఆనంద్ తెలిపారు. ప్రతి ఒక్కరూ పండిట్ దీనదయాల్ ఉపాధ్యాయ గారిని స్ఫూర్తిగా తీసుకోవాలని కోలా ఆనంద్ ఈ సందర్భంగా కార్య కర్తలను కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు మేళాగారం సుబ్రమ ణ్యం రెడ్డి, సొట్ట సుకుమార్, కొండేటి గోపాల్, మద్దు వాసు యాదవ్, కోనేటి అయ్యప్ప, పుణ్యం ఢిల్లీ కుమార్, సి. సుబ్రమణ్యం, లింగబత్తిన గోపాల్, కిరణ్ మణి, మన్న సముద్రం చెంగల్ రాయల్ రెడ్డి, తొట్టంబేడు మండల అధ్యక్షులు వేదం కృష్ణయ్య, కన్నా వెంకటేశ్వర్లు, కేతినేని బాలాజీ, యువమోర్చ పట్టణ అధ్యక్షుడు తానికొండ్ల భరత్, గిరిధర్ సాయి తదితరులు పాల్గొన్నారు.

పండిట్ దీనదయాల్ ఉపాధ్యాయ సేవలు ఆదర్శనీయం
-బీజేపీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ చంద్రప్ప



విశాలాంధ్ర- శ్రీకాళహస్తి: పండిట్ దీనదయాల్ ఉపాధ్యాయ సేవలు ఆదర్శనీయమని బీజేపీ తిరుపతి జిల్లా అధ్యక్షులు డాక్టర్ చంద్రప్ప అన్నారు. శ్రీకాళహస్తి పట్టణం శ్రీరామనగర్ కాలనీలో గల బీజేపీ కార్యాలయంలో సోమవారం పండిట్ దీనదయాల్ ఉపాధ్యాయ జయంతి వేడుకలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ చంద్రప్ప మాట్లాడుతూ దీనదయాల్ ఉపాధ్యాయ రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్, భారతీయ జనసంఘ్ అధినేతగా బ్రిటీష్ వ్యవస్థను పూర్తిగా వ్యతిరేకించారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మాజీ రాష్ట్ర కార్యదర్శి కండ్రిగ ఉమ, మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు ఉమా సింగ్, బీజేపీ మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జీవీ అమరనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పండిట్ దీనదయాల్ జయంతి

విశాలాంధ్ర - తిరుపతి సిటీ: తిరుపతి బిజెపి ప్రధాన కార్యాలయంలో సోమవారం ఉదయం 10గం లకు పండిట్ దీనదయాల్ జయంతి ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు డాక్టర్ చంద్రప్ప మాట్లాడుతూ పండిట్ దీనదయాల్ జీవితం ప్రతిఒక్కరికీ ఆదర్శనీయం అని, వారిని స్మరించుకోవడం మన ధర్మమని పేర్కొన్నారు. రాష్ట్ర కార్యదర్శి ముని సుబ్రహ్మణ్యం, రాచకొండ విశ్వనాథం, డాక్టర్ నరేష్ , వేదవతి వెంకట ముని, పురుషోత్తం రమేష్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు జెడ్పీ విద్యార్థులు

విశాలాంధ్ర - గూడూరు : రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ అండర్-14 బాలుర బ్యాడ్మింటన్ పోటీలకు గూడూరు జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల క్రీడాకారులు షేక్. అఖిల్ అష్రాఫ్, ఎండీ. అఫ్నాన్ సోమవారం నెల్లూరు ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో నిర్వహించిన అండర్ - 14 బాలుర షటిల్ బ్యాడ్మింటన్ జట్టు ఎంపికలో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. త్వరలో కడపలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొననున్నట్లు పీడీ శివ కుమార్ తెలిపారు.

27న జగనన్నకు చెబుదాం

విశాలాంధ్ర - గూడూరు : గూడూరు డీఎస్ఆర్ కమ్యూనిటీ హాల్ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 27న జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రజా విజ్ఞప్తుల దినం జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొననున్నట్లు తెలిపారు. గూడూరు మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు తమ సమస్యలను తెలుపుకొనుటకు సదవకాశం కలుగుతుందన్నారు. మండల ప్రజలు, ప్రజా ప్రతినిధులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఘనంగా కల్యాణ వెంకన్న రథోత్సవం

విశాలాంధ్ర -తిరుపతి రూరల్ : తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంట శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం రథోత్సవం వైభవంగా సాగింది. ఈ సందర్భంగా ఆలయం లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్వామివారిని ప్రాతఃకాల సమయంలో సుప్రభా తంతో మేల్కొలిపి దైనందిన పూజా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం శ్రీవారి ఉత్సవర్లను అలంకార మండపానికి వేంచేపు చేసి రథంపై కొలువు దీర్చారు. బ్రహ్మరథంపై కొలువు దీరిన శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప స్వామి భక్తులకు అభయం ఇచ్చారు. భక్తుల గోవింద నామ స్మరణలతో శ్రీవారి బ్రహ్మరథం ముందుకు కదిలింది. గ్రామ పురవీధుల్లో రథంపై విహరిస్తున్న స్వామి, అమ్మవార్లను దర్శించుకున్న భక్తులు ఉప్పు, మిరియాలు రథంపై చల్లి తమ భక్తిని చాటుకున్నారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, చెవిరెడ్డి లక్ష్మీ దంపతులు, తుడా ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, చెవిరెడ్డి హర్షిత్ రెడ్డిలు స్వామి వారు ఆశీనులైన బ్రహ్మ రథానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి బ్రహ్మరథానికి ముందు భజన బృందాలు, కోలాటాలు , పిల్లన గ్రోవి కళాకారులు, వేద పండితుల మంత్రాలు ఎంతో అలరించాయి. అశ్వ వాహనంపై శ్రీహరి విహారం... బ్రహ్మోత్సవాల్లో ఎనిమిదవ రోజు సోమవారం రాత్రి అశ్వ వాహనంపై దేవదేవుడు విహరించారు. దుష్ట శిక్షణ, శిష్ట రక్షణకై అవతరించిన కల్కి అవతారంలో అశ్వ వాహనంపై అధిరోహించిన స్వామి వారు అభయ హస్తంతో భక్తులను కటాక్షించారు. నేడు చక్ర స్నానం వేడుక తుమ్మలగుంట శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలలో ఆఖరు ఘట్టమైన చక్రస్నానం వేడుకలు ఘనంగా జరుగనున్నాయి. మంగళవారం ఉదయం 7.20 నుంచి 9.10గంటల మధ్య పుష్కరణీలో చక్రస్నానం పూర్తి చేయనున్నారు. అలాగే సాయంత్రం 6 గంటలకు నిర్వహించే ధ్వజారోహణం తో స్వామి వారి బ్రహ్మోత్సవాలు పరిసమాప్తి అవుతాయి.

నిత్య అన్నదానానికి విరాళం

విశాలాంధ్ర - సూళ్లూరుపేట : శ్రీ చెంగాలమ్మ పరమేశ్వరి దేవస్థానము నందు జరుగు నిత్య అన్నదానమునకు సూళ్ళూరుపేట లోని సాయి నగర్ వాస్తవ్యులు శ్రీ కొట్టే వెంకటరమణ సిద్ధాంతి దంపతులు సోమవారం రూ.1,00,016/-లు నగదును శ్రీ చెంగాలమ్మ పరమేశ్వరి దేవస్థాన ఆలయ కార్యనిర్వాహణాధికారి ఆళ్ళ శ్రీనివాస రెడ్డి కి అందజేయుట జరిగినది. నిత్య అన్నదానానికి విరాళం ఇవ్వడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు.

నాయుడుపేట బస్టాండ్ లో కిలాడీ లేడీ అరెస్ట్

విశాలాంధ్ర- నాయుడుపేట: నాయుడుపేట ఆర్టీసీ బస్టాండ్‌లో సోమవారం స్థానిక పోలీసులు ఓ మహిళా కిలాడీ ని అరెస్ట్ చేశారు.బస్టాండ్ లో అనుమానస్పదంగా తిరుగుతున్న ఓ మహిళను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించగా ఆమె వద్ద వున్నా 4 పర్స్ లు, ఒక సెల్ ఫోన్ గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యుత్ షాక్ తో గిరిజన యువకుడు మృతి

విశాలాంధ్ర - గూడూరు : గూడూరు మండలం మంగళపూరులోని బాబురెడ్డి తోటలో కరెంటు షాక్ తో సోమవారం గిరిజన యువకుడు మృతి చెందాడు. ఆదివారం రాత్రి మేకలు కనబడక పోయేసరికి, వెతుక్కుంటూ వస్తుండగా మంగళపూరు గ్రామంలోని బాబురెడ్డి పొలంలో కిందకు వేలాడుతున్న 11కేవీ విద్యుత్ వైర్లు తగలడంతో గిరిజనుడు సంజీవయ్య అక్కడిక్కడే మృతి చెందాడు. తుంగపాలెం గిరిజన యువకులు, సంజీవులు తండ్రి చెంచుకృష్ణయ్య వెతుక్కుంటూ వస్తుండగా బాబురెడ్డి పొలంలో సంజీవులు విగతజీవుడిగా పడి ఉండటం గమనించారు. పొలం యజమాని విదేశాల్లో ఉన్నట్లు, అక్కడ నుండి గ్రామంలోని పెద్ద మనుషులతో మధ్యస్తం చేస్తున్నట్లు సమాచారం. ఇంతజరుగుతున్నా పోలీసులకు ఎటువంటి సమాచారం లేకపోవడం విశేషం. గిరిజన యువకుడు కాబట్టి మధ్యస్తం చేస్తున్నారా, వాళ్ళను భయపెట్టి మధ్యస్తం చేస్తున్నారా? అర్థం కావడం లేదు. పోలీస్ అధికారులు స్పందించి గిరిజన యువకుడు మృతి కి కారణం ఏంటి? సంబంధించిన వారిపై కేసు నమోదు చేసి, సంజీవులు మృతితో అనాథ అయిన చెంచుకృష్ణయ్యకు న్యాయం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సబ్ఎడిటర్ కావలెను

విశాలాంధ్ర జాతీయ దినపత్రిక తిరుపతి ఎడిషన్ కార్యాలయంలో పనిచేయుటకు సబ్ఎడిటర్ కావలెను. ఇతర పత్రికల్లో పనిచేసిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

డిగ్రీ ఉత్తీర్ణులైన వారు అర్హులు

సంప్రదించవలసిన చిరునామా

ఎడిషన్ మేనేజర్

విశాలాంధ్ర దినపత్రిక

9-91/5, దామినేడు, ఇందిరమ్మ గృహాలు ఎదురుగా, తిరుపతి రూరల్.

సెల్: 94909 52129

విశాలాంధ్ర చిత్తూరు జిల్లా

ఆర్టీవో కార్యాలయ నూతన భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు

విశాలాంధ్ర-పుంగనూరు: పట్టణ ప్రాంతంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కృషితో స్థానిక అన్న క్యాంటీన్ భవనంలో తాత్కాలిక ఆర్టీవో కార్యాలయం గతంలో ఏర్పాటు కావడం జరిగింది. ఆర్టీవో కార్యాలయం పక్క భవన నిర్మాణం కొరకు ఆర్టీవో అధికారులు రాష్ట్ర మంత్రివర్యులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దృష్టికి తీసుకొని వెళ్లడంతో దీనిపై స్పందించిన మంత్రి పెద్దిరెడ్డి, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి తెలిపి వెంటనే మండలంలోని బైపాస్ రోడ్డు వద్ద గల జగనన్న కాలనీ సమీపాన ఆర్టీవో కార్యాలయం భవనం నిర్మాణం కొరకు రెండు ఎకరాల 50 సెంట్లు భూమిని కేటాయించి ఐదు కోట్లు నిధులు మంజూరు చేయడం జరిగింది. వాటిని సోమవారం రోజున మండల తాసిల్దార్ కార్యాలయంలో వైసీపీ ముఖ్య నేతలు చిత్తూరు ఎంపీ రెడ్డప్ప, మండల ఎంపీపీ భాస్కర్ రెడ్డి పీకేయం అభివృద్ధి కమిటీ చైర్మన్ వెంకట్ రెడ్డి యాదవ్, జానపద కళల చైర్మన్ కొండవీటి నాగభూషణం చేతులమీదుగా ఆర్టీవో సుప్రియకు ఐదు కోట్ల రూపాయల చెక్కును,రెండు ఎకరాల 50 సెంట్లుకు సంబంధించిన దస్తావేజులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి సహాయ కార్యదర్శి చంద్రహాస్ కౌన్సిలర్ అమ్ము యు నాయకులు రాజశేఖర్ రెడ్డి తాసిల్దార్ సీతారామ పాల్గొన్నారు.

అంగన్వాడీల సమస్యల కోసం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా

విశాలాంధ్ర - కార్వేటినగరం : అంగన్వాడీ సమస్యలపై వివిధ యూనియన్ సంఘల ఆధ్వర్యంలో విజయవాడలో 25న కార్యక్రమన్ని నిర్వహిస్తుంటే పోలీస్లతో అంగన్వాడీ సిబ్బందిని అరెస్ట్ చేయండి ఎంత వరకు సమంజశమని మండల అధ్యక్షులు మమతా, కార్యదర్శి విజయలు ప్రభుత్వ ప్రశ్నించరు. సోమవారం కార్వేటినగరంలోని మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద ప్రాజెక్టు పరిధిలోని కార్వేటినగరం, వెదురుకుప్పం, శ్రీరంగరాజా పురం మండలలకు చెందిన అంగన్వాడీ కార్యకర్తలు, ఆయలు ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మమత మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం కంటే వేయి రూపాయలు వేతనం అధికంగా ఇస్తామని చెప్పిన ముఖ్య మంత్రి పాదయాత్రలో ఇచ్చిన హమీని వెంటనే అమలు చేయాలని, తమ న్యాయమైన సమస్యన్ని వెంటనే పరిష్కారించాలన్నారు. అనంతరం తహసీల్దార్ రవికుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌవరవఅధ్యక్షులు కాంచన మాల, సంఘం సభ్యులు నాగమ్మ, నాగమణి, ఉమా, యువరాణి, గుణ, విద్య, సుధారాణి, రెడ్డమ్మ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర మొదలియార్ వెల్ఫేర్, కార్పోరేషన్ డైరెక్టర్ మాతృమూర్తికి ఘన నివాళి

విశాలాంధ్ర - గంగాధర నెల్లూరు : రాష్ట్ర మొదలియార్ వెల్ఫేర్, కార్పోరేషన్ డైరెక్టర్, మాజీ జడ్పీటీసీ ఎస్. గుణశేఖర్ మాతృమూర్తి సంపూర్ణమ్మ సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఈ సమాచారం తెలుసుకున్న నియోజకవర్గ వైసీపీ సీనియర్ నాయకులు నూకతోటి రాజేష్ సంపూర్ణమ్మ భౌతికయానికి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మొదలియార్ డైరెక్టర్ గుణశేఖర్ మొదలిని ఓదార్చి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మొదటి కార్పొరేషన్ చైర్మన్ బుల్లెట్ సురేష్, నాయకులు వెల్కం కుట్టి, లోకనాదం, కుట్టి తదితరులు పార్టీలకు అతీతంగా పాల్గొన్నారు.

పుత్తూరు కోర్టుకు హాజరైన టిడిపి నాయకులు

విశాలాంధ్ర -కార్వేటినగరం : ఎమ్మెల్సీ ఎలక్షన్స్ సమయంలో ఎలక్షన్ కోడ్ ఉన్నపుడు ధర్నా చేసినందుకు పోలీసులు కేసు పెట్టడంపై సోమవారం పుత్తూరు కోర్టుకు టిడిపి నాయకులు హాజరయ్యారు. ఎం.రాజేంద్రరెడ్డి, ఏ.దామోదరం,ఎన్.నాగేశ్వరరావు టి.రవికుమార్, రవి యాదవ్,రాధాకృష్ణ, నౌషాద్.పి సోమశేఖర్ యాదవ్, కరుణాకర్, హేమంత్,రెడ్డి వాసుదేవ రెడ్డి, జగన్నాథం, చెంగరాయల్ యాదవ్, చెలయ్య, శివకుమార్, ఎం. పరందాం బాలాజీ సోమశేఖర్ కృష్ణ యాదవ్,కుమార్ మోదిలి,బాలాజీ, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో సౌకర్యాలు కరువు -పట్టించుకునే నాధుడే కరువు

విశాలాంధ్ర - వరదయ్యపాలెం : జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బత్తలవల్లం 3 వ తరగతి నుండి 10 వ తరగతి వరకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థులు దాదాపుగా 200 మంది విద్యార్థులు ఉన్నారు. పాఠశాలలో దుస్థితి గురించి పట్టించుకునే నాథుడే కరువయ్యారు. పాఠశాల భవన నిర్మాణం మరియు టాయిలెట్స్ నిర్మాణాలు భోజన సమయంలో తాగునీరు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ఇలా ఉండగా తమ పిల్లలకు పాఠశాలలో సరైన వసతులు లేవని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు.

అథ్లెటిక్స్‌లో విజయం విద్యార్థిని ప్రతిభ

విశాలాంధ్ర-చిత్తూరు: గుంటూరు జిల్లా నాగార్జున విశ్వవిద్యాలయంలో ఇటీవల నిర్వహించిన ఇంటర్ డిస్టిక్ అథ్లెటిక్ పోటీల్లో చిత్తూరులోని విజయం డిగ్రీ కాలేజ్ విద్యార్థిని విశేష ప్రతిభ కనబరిచింది. విజయం డిగ్రీ కాలేజ్ చెందిన యువ శ్రీ హై జంప్ , జావలిన్ త్రో విభాగాల్లో ప్రథమ బహుమతి సాధించినట్లు కళాశాల అధినేత తే జో మూర్తి తెలిపారు. ఇంటర్ డిస్టిక్ పోటీల్లో ప్రతిభ చూపిన యువశ్రీని అధ్యాపక బృందం అభినందించింది.

అంతర పంటలను రైతులు ఈ- పంట నమోదు చేసుకోవాలి

విశాలాంధ్ర-పులిచెర్ల-కల్లూరు:- రైతులు సాగుచేసిన జొన్న ,ఉలవ తదితర అంతర పంటలను తప్పనిసరిగా ఈ -పంట నమోదు చేసుకోవాలని పుంగనూరు డివిజన్ వ్యవసాయ సంచాలకులు శివకుమార్ అన్నారు. పులిచెర్ల మండలం కల్లూరు ,దేవళంపేట పులిచెర్ల లో సోమవారం ఈ -పంట నమోదును పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఈ -పంట నమోదు చేసుకుంటేనే పంటల బీమా పంటలు నష్టపరిహారం అందుతాయని రైతులు సహకరించి ఈ నమోదు చేయించుకోవాలని అన్నారు. అనంతరం రైతు భరోసా కేంద్రాలను పరిశీలించి ఎరువుల నిల్వలపై ఆరా తీశారు.వ్యవసాయ సిబ్బంది, రైతులకు అందుబాటులో ఉండి పంటల సాగుపై ఎప్పటికప్పుడు సలహాలు ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో శ్రీనివాసులు ఆర్బికే సిబ్బంది దినేష్, శ్రీనివాసులు, ప్రసాద్ పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో మెరుగైన వైద్య సేవలు: మేయర్

విశాలాంధ్ర -చిత్తూరు : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందుతుందని నగర మేయర్ ఎస్ అముద చెప్పారు. సోమవారం 39వ వార్డులో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే కార్యక్రమాన్ని మేయర్ పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వే బృందం మేయర్ కు ప్రాథమిక ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఇంటి వద్దకే వెళ్లి ప్రజల ఆరోగ్య స్థితిని తెలుసుకొని, మెరుగైన వైద్య సేవలు అందేలా చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం మేయర్ స్థానిక నేతాజీ వీధిలో పర్యటించారు. పారిశుధ్యం, రోడ్ల మరమ్మత్తులపై అధికారులకు సూచనలు ఇచ్చారు.

ప్రభుత్వ భూమి కబ్జాపై స్పందనలో ఫిర్యాదు

విశాలాంధ్ర- వెదురుకుప్పం: ప్రభుత్వ భూమి లో చొరబడి కబ్జాలకు పాల్పడుతున్నారని సోమవారం చిత్తూరు లో కలెక్టర్ కు స్థానికులు ఫిర్యాదు చేశారు. వివరాలలోకి వెళితే..మండలంలోని జక్కదన రెవెన్యూ పరిధిలో సర్వే నెంబర్ 787 లో ప్రభుత్వ భూమి సుమారు 69 ఎకరాలు ఉంది.అయితే కొందరు వ్యక్తులు రాత్రిపూట జేసిబి యంత్రాలు ఉపయోగించి కొంత భూమిని చదును చేస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు.రాజకీయ నాయకుల అండదండలతో యథేచ్ఛగా ప్రభుత్వ భూములు ఆక్రమణ చేస్తున్నారని చర్యలు తీసుకోవాలని సోమవారం స్పందన లో కలెక్టర్ కు,ఆర్డీఓ కు పిర్యాదు చేసినట్లు స్థానికులు చెప్పారు.అలసత్వం వహిస్తే ఉన్న ప్రభుత్వ భూమి అంతా కబ్జాల పాలవుతోందని వివరించారు.

జిపిఎస్‌ను బలవంతంగా రుద్దితే సహించం : ఫ్యాప్టో

విశాలాంధ్ర- చిత్తూరు: పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తామన్న హామీని తుంగలో తొక్కి, బలవంతంగా జిపిఎస్ విధానాన్ని రుద్దితే సహించేది లేదని ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) స్పష్టం చేసింది రాష్ట్ర నాయకత్వం పిలుపుమేరకు సోమవారం ఫ్యాప్టో ఆధ్వర్యంలో చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా చిత్తూరు కలెక్టర్ కార్యాలయం ఎదుట జరిగిన నిరసన కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ ప్రకారం పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. చాలా రాష్ట్రాలు ఎన్నికల్లో హామీ ఇవ్వకపోయినా, సిపిఎస్ ను రద్దుచేసి పాత పెన్షన్ పథకం అమలు వైపు అడుగులు వేస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. లక్షలాది సిపిఎస్ ఉద్యోగుల కుటుంబాలు, ముఖ్యమంత్రి సానుకూల స్పందన కోసం నాలుగు సంవత్సరాలుగా ఎదురు చూసి ఈరోజు తీవ్ర నిరాశ నిస్పృహలో కొట్టుమిట్టాడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. స్నేహపూర్వకంగా ఉద్యోగుల సంక్షేమానికి కట్టుబడి ఉంటామని పదేపదే చెప్పే ప్రభుత్వ పెద్దలు, నేడు ఉద్యోగ ఉపాధ్యాయులను ఇబ్బంది పెట్టే విధానాలు అనుసరిస్తుండడం సమంజసం కాదన్నారు. పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించే వరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, జగనన్నా మాట తప్పకు మడమతిప్పకు అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో జిల్లా నాయకులు మునాఫ్, దేవరాజులు రెడ్డి, జివి రమణ,అరుణ్ కుమార్, మునీర్ అహ్మద్, కిరణ్ కుమార్, రామ్మూర్తి తదితరులతోపాటు రాష్ట్ర నాయకులు గంటా మోహన్ రఘుపతి రెడ్డి ,చంగ్రలాయ మందడి, సోమశేఖర్ నాయుడు, కడియాల మురళి మదన్మోహన్ రెడ్డి, సిపిఎస్ ఉద్యోగ సంఘ నాయకులు సుధాకర్, శ్రీనివాసులు, సమీర్,బాషా తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల అక్రమ నిర్బంధాన్ని నిరసిస్తూ చిత్తూరులో నిరసన

విశాలాంధ్ర- చిత్తూరు : రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీల సమస్యలు పరిష్కారం చేయకుండా నిర్బంధానికి గురి చేయడం దుర్మార్గమని నిర్బంధాన్ని నిరసిస్తూ సోమవారం చిత్తూరు గాంధీ విగ్రహం వద్ద భారీ ఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఏపీ అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా గౌరవాధ్యక్షుడు వాడ గంగరాజు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కోదండన్ లు మాట్లాడుతూ అంగన్వాడీలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నందుకు అసెంబ్లీ సమావేశాలు సందర్భంగా తమ గోడు చెప్పుకోవడానికి వస్తున్న వారిపై అమానుషంగా నిర్బంధానికి గురిచేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అధికారంలోకి వస్తే అంగన్వాడీలకు పక్క రాష్ట్రం కంటే అదనంగా వేతనాలు ఇస్తామని హామీ ఇచ్చి నాలుగు సంవత్సరాలయిన జీతాలు పెంచలేదని విమర్శించారు. రకరకాల యాప్ లు పేరుతో అంగన్వాడీల పై పని భారం భారీ స్థాయిలో పెంచారు.అన్ని రకాల ప్రభుత్వ పనులు చేస్తున్నప్పటికీ ప్రభుత్వం అంగన్వాడీల సమస్యలు పరిష్కారం చేయడంలో పూర్తిగా విఫలమైందని ధ్వజమెత్తారు .సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యువిటీ అమలు చేయాలని ,కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈరోజు అంగన్వాడీలు అడుగుతున్న కోరికలు గొంతెమ్మ కోరికలు కాదని ఏవైతే హామీలు ఇచ్చారో వాటిని అమలు చేయడంలో ఎందుకు వమీనవేశాలు వేస్తున్నారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు . సమస్యలు పరిష్కారం చేస్తే ధర్నాలు చేయాల్సిన పరిస్థితి లేదు కదా అని ప్రశ్నించారు. ప్రభుత్వం అంగన్వాడీల సమస్యలు పరిష్కారం చేసే దిశగా ఆలోచించకుండా పోలీసులు ద్వారా ఉద్యమాలను అనచాలని ప్రయత్నం చేయడం అరిచేత్తో సూర్యకాంతం ఆపడం ఎంత అవివేకమో ఇది కూడా అంతేనన్నారు.గత ప్రభుత్వాలు అంగన్వాడి పోరాటాలపై నిర్బంధాన్ని విధిస్తే ఆ ప్రభుత్వాలను ఇంటికి పంపించిన చరిత్ర అంగన్వాడీలకు వుంది. అలాంటి పరిస్థితిని మీరు తెచ్చుకుంటున్నారు. చలో విజయవాడ బయలుదేరుతున్న అంగన్వాడీలను రకరకాల పద్ధతుల్లో ఒకరోజు ముందు నుంచి ఇండ్ల దగ్గర నిర్బంధాలు గురిచేయడం, వెళుతున్న వారిని పోలీస్ స్టేషన్లో తరలించి రాత్రి వరకు స్టేషన్లో పెట్టించడం ఏమిటని ప్రశ్నించారు. రాజ్యాంగ హక్కు ప్రకారం రాజ్యాంగబద్ధంగా శాంతియుతంగా కూడా చేయనీయకుండా ఉంటే ప్రభుత్వానికి ఎందుకు అంత భయం అని అన్నారు.ప్రభుత్వం ఇప్పటికైనా అంగన్వాడీల సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో భవిష్యత్తులో జరిగే పరిణామాలకు ప్రభుత్వమే భాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి సిఐటియు యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు సృజని నాయకులు మమత, అంబికా, ప్రమీల, ఆముద ,శాంతి, కన్యాకుమారి, హిమబిందు, సునీత ఏఐటీయూసీ నాయకులు గోపీనాథ్, రమాదేవి, దాసరి చంద్ర, మహిళా సంఘం నాయకులు విజయగౌరిలతో పాటు భారీ సంఖ్యలో అంగన్వాడీ లు పాల్గొన్నారు. చిత్తూరు గాంధీ విగ్రహం వద్ద శాంతి యుతంగా ఆందోళన చేస్తున్న అంగన్వాడీ మహిళలను పోలీసులు అడ్డుకున్నారు. అక్కడే వున్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు వాడ గంగరాజు దగ్గరకు వచ్చిన ఎస్ఐ ధర్నా చేయడానికి పర్మిషన్ లేదు అని దబాయించడంతో మహిళలు తిరగబడ్డారు. కొద్దిసేపు ఉద్రిత్తత కొనసాగింది. శాంతియుతంగా చేస్తున్న కార్యక్రమానికి ఎందుకు అడ్డంకులు తెలుపుతారని అంగన్వాడీలు భారీగా నినాదాలు చేయడంతో పోలీసులు వెనక్కి తగ్గారు .

భవ్యశ్రీ హత్య పై అలసత్వం ఏల...!!

- స్థానిక ఎస్సైని విచారణ నుండి తప్పించాలి - హత్యపై డిప్యూటీ సీఎం స్పందన కరువు
- కోటి రూపాయలు ఎక్స్‌గ్రేసియా ఇవ్వాలి- జనసేన ఇంచార్జి పొన్నా యుగందర్ డిమాండ్

విశాలాంధ్ర-వెదురుకుప్పం:గంగాధర్ నెల్లూరు నియోజకవర్గం, పెనుమూరు మండలం, కాపూరు వారి పల్లి పంచాయితీ, తాణా వేణుగోపాలపురం గ్రామంలో ఒక ఆడబిడ్డ భవ్యశ్రీ అనుమానాస్పద మృతిని శోధించి, చేదించి దోషులకు ఉరిశిక్ష పడేటట్లు చేయాలని జనసేన నియోజకవర్గ ఇన్చార్జ్ డాక్టర్ యుగంధర్ పొన్న డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన సోమవారం మాట్లాడుతూ పోలీసు అధికారులకు అలసత్వం పనికిరాదని, స్థానిక ఎస్సైని ఇన్వెస్టిగేషన్ నుండి తప్పించాలని కోరారు. ఉపముఖ్యమంత్రి ఇలాకాలో ఏమి జరుతుందో ఉప ముఖ్యమంత్రి కే తెలియదని, నారాయణస్వామి ఎందుకు స్పందించలేదని ఎద్దేవా చేశారు. 100 ఓట్లు ఉన్న గ్రామమైనా, లేదా 200 ఓట్లు ఉన్న గ్రామమైనా ఉండి ఉంటే, ఈపాటికి ఆగమేఘాల మీద దస్త్రం కదిలేది, కానీ ఇక్కడ కేవలం 15 కుటుంబాలే కదా నివసిస్తూ ఉండేదన్నారు.ఉపముఖ్యమంత్రి చొరవ ఇందులో ఏ మాత్రం ఉండదని తెలిపారు. ఆయనకు ఓటు కావాలి, ఆయనకి ఎమ్మెల్యే సీటు కావాలి, కానీ ప్రజలకు మాత్రం న్యాయం చేయరని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.భవ్యశ్రీ కుటుంబానికి కోటి రూపాయలు ఎక్స్గ్రేషియా ఇవ్వాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. భవ్యశ్రీ కి సంబంధించిన వివరాలన్నిటిని జిల్లా అధ్యక్షులు పసుపులేటి హరిప్రసాద్ ద్వారా రాష్ట్ర అధ్యక్షులు పవన్ కళ్యాణ్ కు చేరవేసామని, ఈ విషయంలో జనసేన అండ ఈ కుటుంబానికి ఎల్లవేళలా ఉంటుందని, అవసరమైతే మా అధ్యక్షులు వెంటనే స్పందిస్తారని తెలియజేశారు. ఈ కుటుంబానికి న్యాయం జరిగేంతవరకు జనసేన వీరోచితమైన పోరాటం చేస్తుందని, ప్రజా సంఘాలు, పౌర సంఘాలు, అంబేద్కర్ యువజన సంఘాలు, రాజకీయాలకతీతంగా అందరు కలిసి రావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పెనుమూరు మండల అధ్యక్షులు శ్రీనివాసులు, యువజన అధ్యక్షులు గురు ప్రసాద్, మండల కార్యదర్శి శేఖర్, జిల్లా కార్యదర్శిలు , భాను ప్రసాద్, యశ్వంత్, నియోజకవర్గం కార్యదర్శి వెంకటేష్, గంగాధర్ నెల్లూరు మండల ఉపాధ్యక్షులు రషీద్, చిత్తూరు నగర ఉపాధ్యక్షులు రూపేష్, జనసేన నాయకులు చిన్నబాబు, పవన్, యశ్వంత్.తదితరులు పాల్గొన్నారు.

కాణిపాకంలో కనుల పండువగా రథోత్సవం

విశాలాంధ్ర-ఐరాల : స్వయంభు వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాలు భాగంగా సోమవారం ఉదయం దేవస్థానం వారిచే స్వామివారి మూలవిరాట్కు వివిధ రకాల పరిమళ సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. అదేవిధంగా గర్భాలయము, మంత్రాలయము, అన్వేటి మండపము, బంగారు స్తంభము, సుభద మండపము తదితర ప్రాంతాలలో వివిధ రకాల విదేశా పరిమళ పుష్పాలతో అలంకరించారు. అనంతరం సిద్ధి బుద్ధి సమేత ఉత్సవమూర్తులను వేద పండితులచే మంత్ర ఘోష చరణాల నడుమ అభిషేకించారు. అలాగే వివిధ పరిమళ పుష్పాలతో రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించి రథం పై ఉంచి, ఆనవాయితీ ప్రకారం ప్రధమును కొంత దూరం లాగి వదిలిన ఆలయ పాలకమండలి, అధికారులు, ఉభయదారులు అనంతరం మంగళ వాయిద్యాలు నడుమ, కోలాటాలు, డ్రమ్స్, వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాల నడుమ రథోత్సవము ను కాణిపాకం పురవీధుల్లో ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారికి కర్పూర హారతులు ఇచ్చి మ్రొక్కులు తీర్చుకున్నారు. వరస ఉభయదారులుగా కె.ఎత్తి రాజుల నాయుడు, కాకర్ల వారి పల్లి జ్ఞాపకార్థం, వారి కుమార్తె మీనా కుమారి, కీర్తిశేషులు యన్.శివప్రసాద్ నాయుడు, కే. పూర్ణ చంద్రారెడ్డి కాణిపాకం, కె చంద్రశేఖర్ రెడ్డి వారి జ్ఞాపకార్థం వారి కుమారుడు కే.హరి ప్రసాద్ రెడ్డి వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఏ మోహన్ రెడ్డి, ఈవో వెంకటేశు, ఈ ఈ వెంకటనారాయణ, ఏఈఓలు ఎస్వి కృష్ణారెడ్డి, రవీంద్రబాబు విద్యాసాగర్ రెడ్డి, హరి మాధవరెడ్డి, హేమమాలిని, స్థానిక సర్పంచ్ శాంతి సాగర్ రెడ్డి, సీఐ రవి శంకర్ రెడ్డి, ఎస్సైలు శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు,పర్యవేక్షకులు కోదండపాణి, శ్రీధర్ బాబు, రంగస్వామి,టెంపుల్ ఇన్స్పెక్టర్ లు బాబు, సురేష్, ఆలయ అధికారులు మరియు అర్చకులు పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకరణలో శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి

విశాలాంధ్ర-పులిచెర్ల-కల్లూరు:- పులిచెర్ల మండలందేవళం పేట శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో సోమవారం బాద్రపదమాసం ఏకాదశి స్వామి వారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు .ఆలయంలో ఉదయం స్వామివారికి అభిషేకం నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు అర్చనలు పూజలు జరిపి నైవేద్యం సమర్పించారు ఆలయ ప్రధాన అర్చకులు ఫణి ప్రకాష్ శర్మపూజా కార్యక్రమాలు నిర్వహించారు పెద్ద ఎత్తున భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు

ముఖ్యమంత్రిని కలిసిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర-పలమనేరు : సోమవారం ఉదయం రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు శ్రీ వైయస్ జగన్మోహన్ రెడ్డి గారిని అసెంబ్లీ హాలు వద్ద మర్యాద పూర్వకంగా కలిసిన పలమనేరు నియోజకవర్గం ఎమ్మెల్యే డాక్టర్ వెంకటేగౌడ కలిశారు.

టిడిపి నాయకుల అర్ధనగ్న ప్రదర్శన

విశాలాంధ్ర- పలమనేరు : పలమనేరు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో టిడిపి నాయకులు అర్ధనగ్న ప్రదర్శన చేపట్టి తమ నిరసన వ్యక్తపరిచారు. ఈ సందర్భంగా పలమనేరు పట్టణ ప్రధాన కార్యదర్శి గిరిబాబు, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు గ్యాస్ నాగరాజులు ప్రసంగించారు. ఏ తప్పు చేయని చంద్రబాబు నాయుడు పై అక్రమ కేసులు బనాయించి అరెస్టు చేయడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. రాజకీయ కక్ష ధోరణితో జగన్మోహన్ రెడ్డి చంద్రబాబు నాయుడుని అక్రమంగా అరెస్టు చేయించి పైశాచికానందాన్ని పొందుతున్నారన్నారు. తన 45 ఏళ్ల రాజకీయ జీవితంలో మచ్చలేని నాయకుడిగా రాష్ట్ర అభివృద్ధికి పాటుపడిన బాబు కడిగిన ముత్యంలా బయటకు వస్తారని ఆశా భావం వ్యక్తం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో నాయకులు ఆర్బిసి కుట్టి, ఖాజాపీర్,జగదీష్ నాయుడు, మదన్, శ్రీధర్,హనీఫ్, సుధాకర్,సుబ్బు, బాబాజాన్,అస్లాం,సాదిక్,సురేష్ మరియు గంగవరం మండల నాయకులు చిట్టి బాబు,రహీమ్,గిరిధర్ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం

విశాలాంధ్ర -కార్వేటినగరం : కార్వేటి నగరం రాస్ ఆధ్వర్యంలో ఉషారాణి కుమార్తె కీర్తి శిష్యురాలు తులసి పుట్టిన రోజున సోమవారం వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం నిర్వహించారు. అదేవిధంగా స్వీట్లు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వెంకటరామయ్య, షణ్ముగం,మునుస్వామి,రమణ,పీడీలుబాబు,గుర్రప్ప, భీమారావు, చలపతి పాల్గొన్నారు.

వైసిపి మండల కన్వీనర్‌కి ఘన స్వాగతం

విశాలాంధ్ర - వరదయ్యపాలెం : వరదయ్య పాలెం మండలం బత్తలవల్లం గ్రామం లో నందకిషోర్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి, స్వీట్లు పంచి శుభాకాంక్షలు తెలిపారు ఈ కార్యక్రమం లో గిరి రెడ్డి, శీను రెడ్డి, ధనపాల్, ప్రభాకర్, సుబ్రహ్మణ్యం,చెంచుబాబు,పీవీ రమేష్, రాఘవ రెడ్డి మరియు యూత్ పాల్గొని కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా దయాకర్ రెడ్డి మాట్లాడుతూ, గతంలో కంటే అందరూ ఐక్యతతో పని చేసి, వైఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ ని, పటిష్టంగా నడిపించాలని, అందుకు అందరూ సహకరించాలన్నారు.

ఘనంగా పండిట్ దీన్‌దయాల్ జయంతి

విశాలాంధ్ర-కార్వేటినగరం :కార్వేటినగరంలోని శ్రీ పండిట్ దిన దాయల్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా సోమవారం ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పండిట్ దీన్‌దయాల్ ఉపాధ్యాయుకి జీవితమంతా పూర్తిగా కూడుకున్నదని బిజెపి మండల పార్టీ అధ్యక్షులు రామిరెడ్డి రాజశేఖర్ అన్నారు. అంత్యోదయ ద్వారా సమాజంలో అట్టడుగు వర్గంతో ఉన్న ఆఖరి వ్యక్తి వరకు లబ్ధి పొందే విధంగా అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లడమే ప్రధాన లక్ష్యంగా వారి జీవితం సాగిందన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు నడింపల్లి యువరాజ్, తదితరులు పాల్గొన్నారు.

మల్లేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర-పులిచెర్ల-కల్లూరు: పులిచెర్ల శ్రీ మల్లేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు చేసి నైవేద్యం సమర్పించారు. ఆలయంలో ఉదయం స్వామివారికి అభిషేకం నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. అర్చనలు పూజలు జరిపి మహా మంగళారతి గావించి స్వామివారికి నైవేద్యం సమర్పించారు. ఆలయ ప్రధాన అర్చకులు రాజశేఖర్ దీక్షితులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉభయదారులుగా గంటా వారి పల్లెకు చెందిన యల్లప్ప కుటుంబ సభ్యులు వ్యవహరించారు. ఉభయదారులు యల్లప్ప మనవడు పుట్టినరోజు సందర్భంగా స్వామివారికి అభిషేకం పూజా కార్యక్రమాలు జరిపి భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

రాష్ట్ర స్థాయిలో విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర-వెదురుకుప్పం: మండలం లోని తిరుమలయ్య పల్లి జెడ్పి హైస్కూల్ నందు విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో స్కూల్స్ గేమ్స్ రెజ్లింగ్‌లో వెండి మరియు కాంస్య పథకాలను కైవసం చేసుకున్నారని ప్రధానోపాధ్యాయురాలు లలిత కుమారి తెలిపారు. ఈ రాష్ట్ర స్థాయి గేమ్స్ ఇటీవల కృష్ణా జిల్లా లో నిర్వహించినట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో రేన్వంత్ కుమార్,వై దీక్షా రెడ్డి వెండి రజిత పథకాలు అందుకున్నట్లు చెప్పారు.పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

ఉపాధ్యాయులకు ఘన సన్మానం

విశాలాంధ్ర-పులిచెర్ల-కల్లూరు: పులిచెర్ల మండలంలో ఎర్ర పాపి రెడ్డి గారి పల్లె ప్రాథమిక ఉన్నత పాఠశాల నుంచి బదిలీ అయిన ఉపాధ్యాయులు నానిక నాయక్, ప్రతాప్ రెడ్డి, ఆంజనేయులను సోమవారం ఎంపీపీ సురేంద్ర నాథ్ రెడ్డి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మంత్రి పెద్దిరెడ్డి పీఏ ముని తుకారాం, ఎంఈఓ లు సిద్ధరామయ్య ,పోకల తాతయ్య, వైసీపీ మండల పార్టీ అధ్యక్షుడు నాదముని రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులు సమాజసేవకు సిద్ధంగా ఉండాలి

విశాలాంధ్ర-కార్వేటినగరం : విద్యార్థులు సమాజసేవకు, దేశ సేవకు సిద్ధంగా ఉండాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల పిన్సిపాల్ డాక్టర్ ఎస్. విజయులు రెడ్డి పేర్కొన్నారు. సోమవారం డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ధనంజయరెడ్డి ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నతనం నుండి విద్యార్థులు సేవా దృక్పథాన్ని అలవరుచుకోవాలని తెలిపారు. అలాగే పరిసరాలలో ప్లాస్టిక్ నివారణ, మొక్కలను పెంచడం, సామాజిక బాధ్యత కలిగి ఉండాలని కోరారు. అనంతరం ఎన్ఎస్ఎస్ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు వ్యాచరచన పోటీలు నిర్వహించి, ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. తిరుపతి ఎస్వి యూనివర్శిటీ లో ముం దస్తు రిపబ్లిక్ దినోత్సవ వేడుకలలో పాల్గొన్న కళాశాల విద్యార్థులను ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం అభినందించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు బాలసుబ్రమణ్యం ఆచారి, సీఎస్.లత, హరిబాబు, సుబ్బారావు, జోగి ప్రసాద్, కార్తీక్, భార్గవి, లావణ్య, స్వామి శివయ్య, గోపీ కృష్ణ, శివరామకృష్ణ, జేకేసి మెంటర్ లోకేశ్వర్, విద్యార్థులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర తిరుపతి జిల్లా

పోలీసు "స్పందన"కు 86 వినతులు

విశాలాంధ్ర - తిరుపతి సిటీ: తిరుపతి జిల్లా పోలీస్ కార్యాలయంలో 'స్పందన' కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ పరమేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు అదనపు ఎస్పీ వెంకట్రావు సోమవారం నిర్వహించారు. ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి, సమస్యలకు సానుకూలంగా స్పందించి, ప్రతి ఒక్కరి కేసు విషయాలను అడిగి తెలుసుకొని సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చి త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. ఎట్టి పరిస్థితుల్లో కూడా స్పందన ఫిర్యాదుల పట్ల అలసత్వం వహించకూడదని పోలీస్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కుటుంబ కలహాలు, ఆర్థిక పరమైన నేరాలు, ఆస్తి తగాదాలు ఇతరత్రా కారణాలతో ప్రజలు ఫిర్యాదులు చేశారు. ఈ కార్యక్రమం ద్వారా జిల్లా ఎస్పీ కార్యాలయానికి జిల్లా నలుమూలల నుంచి 86 మంది వచ్చి వారి సమస్యలను స్పందన ద్వారా విన్నవించుకున్నారు.స్పందన కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, నిర్దేశించిన గడువు లోగా ఫిర్యాదుదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. సుదూర ప్రాంతాల నుంచి ప్రయాసపడి ఎస్పీ కార్యాలయానికి రాలేని వృద్ధులు, మహిళలు వారి పరిధి పోలీస్ స్టేషన్ల లోనే ఫిర్యాదు చేయవచ్చని వాటిని కూడా స్పందన ఫిర్యాదు లానే పరిగణించి, పరిష్కరించడం జరుగుతుందన్నారు.

భూమి లేని వారికి భూమిని పంచాలి :ఎమ్మార్వోకు గ్రామస్తుల వినతి

విశాలాంధ్ర - బుచ్చినాయుడుకండ్రిగ: భూమిలేని నిరుపేదలకు భూ పంపిణీ చేయాలని కుక్కంబాకం గ్రామస్తులు సోమవారం తాసిల్దార్ కార్యాలయంలో తహసిల్దార్ భార్గవికి వినతి పత్రం ద్వారా విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఢిల్లీ బాబుయాదవ్, మాజీ సర్పంచ్ వెంకట కృష్ణయ్య యాదవ్‌లు మాట్లాడుతూ కుక్కంబాకం రెవెన్యూ లెక్క దాఖలలో ఉన్న సర్వే నెంబర్ 81లో 50 ఎకరాల వివాదాస్పదభూమిని పంచాయితీ పరిధిలో ఉన్న భూములను నిరుపేదకు పెంచాలని కోరారు. కులమతాలకు అతీతంగా భూములను వారిని గుర్తించి వారిని ఆదుకోవాలని కోరారు. దీనిపై తహసిల్దార్ భార్గవి అసహనానికి గురై ఇరు వర్గాల మధ్య వివాదంగా మారింది. దీనిపై అమె ఆగ్రహానికి చెందారు. అధికారులు పనిచేస్తున్నది ఈ ఒక్క సర్వే నెంబర్ లో భూ సమస్య పైన అధికారులు పనిచేయరు గ్రామంలో ఎన్ని వర్గాలు ఉంటే అన్ని వర్గాల వ్యక్తులు 'కులబలం జనబలం' తో వారి వారికి అనుకూలమైనటువంటి సంఘాలు తీసుకొచ్చి అధికారులు పైన దౌర్జన్యం చేయడం కాదని హెచ్చరించారు మండలంలోని గ్రామాలలో నెలకొన్న ప్రతి భూ సమస్యను పరిష్కరించుటకు రెవెన్యూ అధికారులు ఉన్నారని ఆమె అసహనం వెళ్ళబోశారు. ఈ భూమి విషయమై జిల్లా అధికారులకు నివేదికలు పంపి ఉన్నాయి. గ్రామస్తులు ఒక్కటై వస్తే అధికారుల ఎమ్మెల్యే, జిల్లా అధికారుల ఆదేశాల మేరకు భూ పంపిణీ కార్యక్రమం జరుగుతుందన్నారు.

దళితుల పక్షపాతి బాబు: జై భీమ్ నాయకులు

విశాలాంధ్ర - చంద్రగిరి: మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దళితుల పక్షపాతి అని జై భీమ్ నాయకులు పేర్కొన్నారు. బాబు అక్రమ అరెస్టుకు నిరసనగా చంద్రగిరి టవర్ క్లాక్ వద్ద 12వ రోజు రిలే నిరాహార దీక్షలో భాగంగా సోమవారం జై భీమ్ ఆధ్వర్యంలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలో టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని పాల్గొన్నారు. డప్పు కొట్టుతూ కార్యకర్తల్లో ఉత్సాహం నింపుతూ రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న పులివర్తి నాని దళితుల పక్షపాతి చంద్రబాబు నాయుడు అన్నారు. దళితుల నిధులను జగన్ ప్రభుత్వం కాజేసి వారిని మోసగించిదన్నారు. వైసిపి నాయకులు, కార్యకర్తలు అనునిత్యం దళితులను అవమానిస్తూనే వున్నారని ఆరోపించారు. అవగాహన లేని పథకాలతో, జగన్ మాయమాటలకు దళితులమంతా మోసపోయామని దళితులు ఆవేదన వ్యక్తంచేశారు. జై భీమ్‌లంతా ఒక్కటై రాష్ట్రంలో చంద్రబాబు నాయుడుని, నియోజకవర్గంలో నానిని గెలిపించి తీరుతామని శపథం చేశారు. ఈ దీక్షాలో తెలుగు దేశం పార్టీ రాయలపురం మాజీ సర్పంచ్ పాళెం మనోహర్, జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు బాపనపట్టు అమ్ములు, రామారావు, విసురిపాటి శంకర్, అంకాలయ్య, చంద్రమౌళి, బాలసుబ్రమణ్యం నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ముక్కంటి ఆలయంలో పవిత్రోత్సవాలు ప్రారంభం

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో సోమవారం పవిత్రోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలు ఐదు రోజుల పాటు నిర్వహించనున్నారు. పవిత్రోత్సవాలలో భాగంగా మొదటి రోజున ఆలయ స్థానాచార్యులు స్వామినాథన్ గురుకుల్, వేద పండితుల ఆధ్వర్యంలో దక్షిణామూర్తి వద్ద శ్రీ-కాళ-హస్తి ఉత్సవర్లు, భరద్వాజ మహర్షి ఉత్సవమూర్తిని కొలువు తీర్చి వివిధ రకాల అభిషేకాలు నిర్వహించారు. ఉత్సవర్లుకు వివిధ రకాల పూజ ద్రవ్యాలతో అభిషేకాలు జరిపి అలంకారాలు చేశారు. ధూప దీప నైవేద్యాలు నివేదించి, పూర్ణ హారతులు సమర్పించారు. ఈ పూజల్లో ధర్మకర్తల మండలి అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు దంపతులు, శ్రీకాళహస్తి శాసనసభ్యులు బియ్యపు మధుసూదన్ రెడ్డి సతీమణి వాణి, కుమార్తె బియ్యపు పవిత్రా రెడ్డి ధర్మకర్తల మండలి సభ్యులు, కొండూరు సునీత, పసల సుమతి, ప్రత్యేక ఆహ్వానితులు శ్రీదేవి, ప్రధాన అర్చకులు కరుణాకర్ గురుకుల్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నూకరత్నం,డిప్యూటీ ఈవో జే.వెంకటసుబ్బయ్య, ఏఈవో ధనపాల్, టెంపుల్ ఇన్స్పెక్టర్ సుదర్శన్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహానికి టీడీపీ దళిత నేతల వినతి

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: నైపుణ్యాభివృద్ధి కేసులో అక్రమంగా అరెస్టు చేసిన తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడును వెంటనే విడుదల చేయాలని కోరుతూ శ్రీకాళహస్తిలో సోమవారం భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి దళిత నేతలు వినతిపత్రం సమర్పించారు. టీడీపీ ఎస్సీ విభాగం నియోజకవర్గం అధ్యక్షులు చుక్కల రమేష్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వైసీపీ ప్రభుత్వంలో దళితులకు తీరని అన్యాయం జరుగుతోందన్నారు. దళితులపైనే ఎస్సీ,ఎస్టీ కేసులు నమోదు అవుతున్నాయన్నారు. ఇలాంటి ప్రభుత్వాన్ని ఎన్నడూ చూడలేదన్నారు. దళితుల అభ్యున్నతికి 17 జీవోలు తెచ్చి మంచి చేసిన టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడును జైల్లో పెట్టించారని ఆవేదన వ్యక్తం చేశారు.చంద్ర బాబు నాయుడును వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. చంద్రబాబును విడుదల చేయకపోతే దళితులంతా ఏకమై పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణాధ్యక్షులు విజయకుమార్, టీడీపీ తిరుపతి జిల్లా అధికార ప్రతినిధి రంగినేని చెంచయ్య నాయుడు, రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి నాయకులు గాదిపాకుల గోపినాథ్, నియోజక వర్గ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి భాస్కర్, అంకయ్య, సుబ్రమణ్యం, చంద్ర, దారా పాండు, గుణయ్య, రమేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

గోకుల కృష్ణాలో ఘనంగా ఫార్మాసిస్టుల దినోత్సవం

విశాలాంధ్ర - సూళ్లూరుపేట : స్థానిక గోకుల కృష్ణ ఫార్మసీ కళాశాలలో సోమవారం నాడు ప్రపంచ ఫార్మాసిస్టుల దినోత్సవాన్ని పురస్కరించుకొని వివిధ కార్య క్రమాలు నిర్వహించామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాలగాని పవన్ కుమార్ తెలిపారు. మొదటగా కళాశాల విద్యార్థినీ విధ్యార్థులకు ఫార్మాసిస్టుల పాత్ర మరియు అవయవదానం మీద అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఫార్మసిస్టు ఆరోగ్య వ్యవస్థను బలోపేతం చేయడం అనే అంశం మీద విద్యార్థినీ విధార్థులకు వక్తృత్వ పోటీ, వ్యాస రచన, లోగో మరియు స్లోగన్ పోటీలు నిర్వహించారు. అనంతరం కళాశాల జాతీయ సేవ సమితి విభాగం ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. తదుపరి సూళ్లూరుపేట పట్టణంలో గోకుల కృష్ణ ఫార్మసీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థిని విద్యార్థులు హెరాలీ క్రాస్ కూడలి నుండి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించి ఆరోగ్య వ్యవస్థను బలోపేతం చేయడంలో ఫార్మాసిస్టులు విశిష్టతను తెలియజేస్తూ నినాదాలు చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. ముగింపు కార్యక్రమంలో పోటీలలో ప్రతిభకనపరిచిన విద్యార్థినీ విద్యార్థులను కళాశాల చైర్మన్ గిలకా బ్రహ్మయ్య అభినందించారు. ఈ కార్యక్రమం లో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాలగాని పవన్ కుమార్, ప్రోగ్రాం కోఆర్డినేటర్స్ శ్రీదేవి, తొప్పని స్వాతి, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ పేట శివకుమార్, అధ్యాపకులు మరియు అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్వాడి, మధ్యాహ్న భోజన కార్మికుల అక్రమ అరెస్టుల నిరసనగా

ఆర్డీవో కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున ధర్నా

ఏఐటియుసి సిఐటియుల ఆధ్వర్యంలో అక్రమ అరెస్టులకు నిరసనగా ధర్నా కార్యక్రమం

విశాలాంధ్ర - తిరుపతి : తిరుపతి ఆర్డీవో కార్యాలయం వద్ద జరిగిన ధర్నా కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఎం రాష్ట్ర నాయకులు మధుగారు జిల్లా ప్రధాన కార్యదర్శి కె రాధాకృష్ణలు మాట్లాడుతూ అక్రమ అరెస్టులతో ఉద్యమాలు ఆగవని. కేసులకు కార్మిక వర్గం భయపడదని విద్యుత్ పోరాటంలో అసువులు బాసిన అమరవీరుల స్ఫూర్తితో రాష్ట్రంలో కార్మిక వర్గం పెద్ద ఎత్తున పోరాటాలకు సన్నద్ధమవుతుందని ఇప్పటికే కార్మిక చట్టాల మార్పుకు వ్యతిరేకంగా పెరుగుతున్న ధరలకు వ్యతిరేకంగా రాష్ట్రంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు జరుగుతున్నాయని ప్రజా ఉద్యమాల పట్ల అక్రమ అరెస్టులు అక్రమ కేసులతో భయభ్రాంతులను చేసి ఉద్యమాలు ఆపాలి అని అనుకోవడం చాలా సిగ్గుచేటు అయిన విషయమని" మాట తప్పను- మడమ తిప్పను" అని చెప్పే ముఖ్య మంత్రి అనుసరించే తీరు ఆంధ్ర రాష్ట్ర ప్రజానీకం సిగ్గుతో తలవంచుకుంటున్నారని ఇదే పద్ధతి కొనసాగిస్తే రానున్న ఎన్నికల్లో నిన్ను ఇంటికి పంపాల్సి వస్తుంది అని హెచ్చరించారు ఇంకా ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి పి మురళి సిపిఐ నగర కార్యదర్శి విశ్వనాథం సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి .సిపిఎం జిల్లా కార్యదర్శి నాగరాజు సిపిఎం నగర కార్యదర్శి సుబ్ర

హ్మణ్యం ఐఎఫ్‌టియు నాయకులు వెంకటరత్నం ప్రసంగించారుఎస్ డి రవి నగర ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి.ఈ ధర్నా కార్యక్రమానికి అధ్యక్షత వహించగా నాయకులు చంద్రశేఖర్ రెడ్డి .వైయస్ మణి. శ్రీరాములు. శ్రీనివాసులు. మోహన్ రెడ్డి. రజాక్ .సురేష్. మహేంద్ర. నరసింహులు, ముద్దుకృష్ణ, కనకరాజు, సీఐటీయూ నాయకులు వేణు బుజ్జి సిపిఎం నాయకులు జయ చంద్ర, సాయి లక్ష్మి, మురళి నాగరాజమ్మ ఐఎఫ్టియు నాయకులు ముని మరియు ఎఐటియుసి సిఐటియు నాయకులు పాల్గొన్నారు

చంద్రయాన్-3 మహా క్విజ్‌లో పాల్గొనండి

ఇస్రో చైర్మన్ సోమనాధ్ భారతీయులకు పిలుపు

విశాలాంధ్ర- సూళ్లూరుపేట : భారత పౌరులుగా గర్వించే విధంగా ఇస్రో చంద్రయాన్ - 3 ప్రయోగ విజయం తో ఎనలేని కీర్తిని భారత్ కు తెచ్చి పెట్టింది,ఇప్పుడు చంద్రయాన్ - 3 ప్రయోగ పరిశోదల పై భారతీయులలో అవగాహన కల్పించి చంద్రయాన్ గురించి తెలుసుకునే విదంగా ఆసక్తిని పెంచడం కోసం చంద్రయాన్ - 3 మహా క్విజ్ పోటీలను ఆన్ లైన్ ద్వారా మొదలు పెట్టింది,ఇప్పటికే 16 లక్షల మంది భారతీయులు ఈ క్విజ్ లో పాల్గొని ఉన్నారు, మనకు 10 ప్రశ్నలు చంద్రయాన్ కు సంబంధించి ఇస్తారు 300 సెకండ్లలో జవాబులను టిక్ కొట్టాల్సి ఉంటుంది, మీరు ఈ క్విజ్ లో పాల్గొన వచ్చు ఈ క్రింద ఉన్న లింకును క్లిక్ చేశారంటే చాలు క్విజ్ పేజీ లోకి వెళ్ళ వచ్చు ఈ క్విజ్ లో పాల్గొని గెలిచిన వారికి సర్టిఫికెట్ తో పాటు నగదు బహుమతి కూడా ఉంటుంది.

సీనియర్ జర్నలిస్ట్ ఆత్మకూరు బాస్కర్‌కు పుత్ర వియోగం

విశాలాంధ్ర- నాయుడుపేట : నాయుడుపేట మండలం నందు ప్రముఖ దినపత్రిక సీనియర్ జర్నలిస్ట్ ఆత్మకూరు భాస్కర్ పెద్ద కుమారుడు ఆత్మకూరు రాకేష్ (22) సోమవారం ఉదయం నాయుడుపేట పట్టణంలోని మంగపతి నాయుడు నగర్ లోని వారి నివాసంలో గుండిపోటుతో కన్నుమూశారు . రాకేష్ విజయవాడ సిద్ధార్థ మెడికల్ కళాశాలలో ఎంబిబిఎస్ 2వ సంవత్సరం అభ్యసిస్తున్నారు.వినాయకచవితి పండుగ వేడుకలు తన కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా జరుపుకున్నారు. హఠాత్తుగా గుండెపోటుతో రాకేష్ కనుమూయడంతో అతని కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతం అవ్వడాన్ని చూసిన పలువురు కంటతడి పెట్టారు. సమాచారం తెలుసుకున్న పలువురు నాయకులు, విలేకరులు భాస్కర్ నివాసానికి చేరుకుని రాకేష్ పార్థివ దేహానికి పూలమాల వేసిన నివాళులు అర్పించారు. అనంతరం భాస్కర్ కుటుంబ సభ్యులను పరామర్శించి, భగవంతుడు వారికి మనోధైర్యాన్ని ప్రసాదించాలని కోరారు.

హరిత రాయబారులకు ఘన సన్మానం

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి : గ్రామాల్లో పారిశుద్యం మెరుగుదలలో హరిత రాయబారుల సేవలు అమోఘమని, అభినందనీయమని తెలుపుతూ సోమవారం హరిత రాయబారులను ఘనంగా సన్మానించారు. మండల ప్రజాపరిషత్ శ్రీకాళహస్తి కార్యాలయంలో స్వచ్ఛతాహి సేవ కార్యక్రమం కింద మండలంలోని హరిత రాయబారులను సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కరోనా సమయంలో, గ్రామాల్లో పారిశుద్యం మెరుగుదలలో హరిత రాయబారుల సేవలు అమోఘమని, స్వచ్ఛభారత్‌లో భాగంగా ప్రభుత్వం గ్రామాల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇస్తుందన్నారు. గ్రామాల్లో పారిశుద్యం మెరుగుపడి అంటువ్యాధులు గణనీయంగా తగ్గాయన్నారు. గ్రామాల్లో పారిశుద్యం మెరుగుదలలో హరిత రాయబారుల సేవలు అమోఘమన్నారు. ఈ కార్యక్రమంలో మండలం లోని సర్పంచులు, ఎంపీటీసీలు,పంచాయతీ కార్యదర్శులు, హరిత రాయబారులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారి, విస్తరణాధికారి పి.ఆర్ అండ్ ఆర్.డి, మండల జెసిఎస్ కన్వీనర్ నాగూర్ రెడ్డి పాల్గొన్నారు.

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మళ్ళీచోరీ

విశాలాంధ్ర- వరదయ్యపాళెం: తిరుపతి జిల్లా వరదయ్యపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరికి పాల్పడ్డారు. ఇప్పటికీ ఇదే పాఠశాలలో చోరీ జరగడం గత ఏడాదిన్నర కాలంలో ఇది మూడో సారి కావటం గమనార్హం.పాఠశాలలో విద్యార్థుల విద్యావసతి కోసం ఏర్పాటు చేసిన తాగునీటి పైపులు కరెంట్ తీగలు చోరీ చేశారు. ఇలా చోరీ జరిగిన ప్రతిసారీ ఉపాధ్యాయులు తమ సొంత వ్యయం ఖర్చు పెట్టి వేలాది రూపాయలను భరించాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ చోరీల విషయమై పోలీసులు ఉదాసీనంగా వ్యవహరించడంపై ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.చోరీలపై విచారణ చేసి దొంగతనాలను అరికట్టి పాఠశాల ఆస్తులను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

వైయస్సార్ కాంగ్రెస్ లో వైరం వీడింది

విశాలాంధ్ర - బుచ్చినాయుడు కండ్రిగ: వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల పార్టీలో నాయకుల మధ్య వైరం వీడి సోమవారం నాయకులు మధ్య స్నేహభావం నెలకొంది. గత మూడు నెలలుగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో మండలంలోని మండల స్థాయి నాయకుల మధ్య విభేదాలు తారా స్థాయికి చేరి వివాదాలు నెలకొన్నాయి, ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం చొరవతో రానున్న సార్వత్రికి ఎన్నికలలో భాగంగా అందరూ ఒకటే పార్టీని గెలిపించడం కీలక పాత్ర పోషించాలని ఉద్దేశంతో మండలంలోని విభేదాలు ఉన్న పార్టీ నేతలు తో స్నేహపూర్వకంగా మాట్లాడి అందర్నీ సమన్వయ పరచడంలో కీలక పాత్ర పోషించారు. రెండోసారి మండల పార్టీ అధ్యక్షుడు గా ఆరణి విద్యానాథరెడ్డి ఎంపిక చేయడంతో. విభేదంతో దూరమైన వై ఎస్ కాంగ్రెస్ జిల్లా ప్రధాకార్యదర్శి జొన్నల గోపాల్ రెడ్డి ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శ్యాలువు తో సత్కరించి విభేదాలు వీడి స్నేహంగా పార్టీని ముందుకు నడిపించుకోవాలని వారు ఇరువురు శాంతి చర్చలు జరుపుకొని స్నేహానికి పునాది వేశారు. దీంతో సూర్యగ్రహణం వీడి చంద్రోదయం వైపు నడిచే స్థితికి మండల నాయుకు లు చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ముని కృష్ణారెడ్డి జే సి ఎస్ కన్వీనర్ అందెన భాస్కర్ రెడ్డి దేవతా సంజీవయ్యలు నాయకులు పాల్గొన్నారు

అండర్ 17 రాష్ట్ర పోటీలకు ప్రాస్పరో విద్యార్థులు

విశాలాంధ్ర - గూడూరు : నెల్లూరు ఏసీ సుబ్బారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన జిల్లా స్థాయి క్రీడా పోటీలలో అండర్ 17 షటిల్ బాడ్మింటన్ బాలికల విభాగంలో గూడూరు ప్రాస్పరో స్కూల్ కు చెందిన లక్ష్మి ప్రియ, అంషద్ ఫర్వీన్ జట్టు ఫైనల్స్ లో గెలుపొంది వైజాగ్ లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ప్రాస్పరో స్కూల్ డైరెక్టర్ దశరథరామిరెడ్డి, ప్రిన్సిపల్ ఆంటోని ఎంపికైన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

చంద్రబాబు విడుదలకోసం టీడీపీ రిలే దీక్షలు

విశాలాంధ్ర- శ్రీకాళహస్తి: నైపుణ్యాభివృద్ధి కేసులో అక్రమంగా అరెస్టు చేసిన టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడును వెంటనే విడుదల చేయాలని ఆ పార్టీ నేతలు డిమాండు చేశారు. శ్రీకాళహస్తి పట్టణంలోని ఎన్టీఆర్ భవన్ లో సోమవారం ఏర్పేడు అధ్యక్షులు పొన్నారావు, క్లస్టర్ ఇంచార్జీలు రెడ్డివారి గురువారెడ్డి, నాగరాజు నాయుడు ఆధ్వర్యంలో రిలే దీక్షలు చేశారు. వీరి దీక్షకు శ్రీకాళహస్తి ప్రజలు స్వచ్ఛందంగా సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా టీడీపీ నేతలు మాట్లాడుతూ... చంద్రబాబునాయుడు కడిగిన ముత్యంలా బయటకు వస్తారన్నారు. ప్రజల్లో ఆదరణ చూసి ఓర్వలేక చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేసి జైలుకు పంపారన్నారు. చంద్రబాబుకు అండగా ప్రజలు నిలబడాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రాష్ట్ర కార్యదర్శులు గాలి చలపతి నాయుడు, దశరదాచారి, పార్లమెంటు నాయకులు చెంచయ్యనాయుడు, ధనంజయులు, శివశంకర్ రెడ్డి, నాగరాజు నాయుడు, రాజేష్ నాయుడు, గుణాయాదవ్, చెలికం పాపి రెడ్డి, ప్రసాద్ నాయుడు, చంద్ర, ముని రెడ్డి, శివాజీ రెడ్డి, అంకయ్య, రవి నాయుడు, సీతాపతి ఆచారి, శ్రీధర్, నాగేశ్వరావు, రాఘవేంద్ర, సురేష్, కృష్ణ వేణి, హంస, అశ్వర్థమ్మ, నరసింహులు, మోహన్, వెంకయ్య, ముని రామి రెడ్డి, నాదముని రెడ్డి, రాంబత్తెయ్య, పట్టణ అధ్యక్షులు విజయ్ కుమార్, తొట్టంబేడు మండల అధ్యక్షులు గాలి మురళి నాయుడు, కామేష్ యాదవ్, కాసరం రమేష్, ప్రతాప్ రెడ్డి, దొరైరాజ్ రెడ్డి, ఆర్ముగం, గుర్రప్ప శెట్టి, ప్రకాష్ నాయుడు, రేణుకమ్మ, సుమతి, మల్లీశ్వరి, కంఠా రమేష్, జిలానీ బాషా, గోపినాథ్, పోలూరు శ్రీనివాసులు రెడ్డి, యమ్ యస్ రెడ్డి, చుక్కల రమేష్, దొరస్వామి, నరసింహులు, అనిత, సుభాషిణి, దుర్గమ్మ, కృష్ణమనాయుడు, అమరావతి, సాయి నాయుడు, శాంతమ్మ, చంద్రకళ, ఊహ, జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు పేరిట శ్రీకాళహస్తీశ్వరునికి ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి : టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు పేరున శ్రీకాళహస్తీశ్వరాలయంలో ప్రత్యేక పూజలను టిడిపి నాయకులు చేపట్టారు. జాతీయ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు పేరుమీద రాష్ట్ర కార్యదర్శి రెడ్డి వారి గురవారెడ్డి ఆధ్వర్యంలో శ్రీకాళహస్తి ఈశ్వర ఆలయం నందు స్వామి అమ్మవార్ల వద్ద ప్రత్యేక పూజలు అర్చనలు నిర్వహించి వారికి అన్ని విధాల మంచి ఆరోగ్యాన్ని అత్యంత తొందరగా జైలు నుంచి అక్రమ కేసుల నుంచి విముక్తి కలగాలని ఆ భగవంతున్ని ప్రార్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రాష్ట్రంలో అరాచక పరిపాలన అంతం కావాలని, సుప్రీంకోర్టులో చంద్రబాబునాయుడుకు అనుకూలమైన తీర్పు వచ్చి న్యాయం గెలవాలని, సత్యం జయించాలని ఆ స్వామి అమ్మవారిని ప్రార్ధించి బాబుకి ఆశీస్సులు ఉండాలని స్వామి వస్త్రాన్ని దేవుడు ముందర పెట్టి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి రెడ్డివారి గురవారెడ్డి తో పాటు మండల పార్టీ అధ్యక్షులు పున్నారావు, సీనియర్ నాయకులు నాగేశ్వరరావు, మండల బీసీ సెల్ అధ్యక్షులు మునయ్య, పార్టీ యువత, పార్లమెంటు అధికార ప్రతినిధి రాఘువులు యాదవ్, ఐటిడిపి నాయకులు బాలాజీ, పార్టీ నాయకులు సిద్దులయ్య, సోమశేఖర్ పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం ప్రమాణ స్వీకారం

విశాలాంధ్ర - నాయుడుపేట : ఆర్యవైశ్య సంఘం ప్రమాణ స్వీకారోత్సవం ఆ సంఘం గౌరవ అధ్యక్షులు పెసల రాజగోపాల్ ఆధ్వర్యంలో జరిగింది. నూతన ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులుగా తులాబంధు సుబ్రహ్మణ్యం, కార్యదర్శిగా ఎస్ చంద్రశేఖర్, కోశాధికారిగా ఎం మల్లికార్జున రావు, కార్యవర్గ సభ్యులుగా గూడూరు కిషోర్ కుమార్,కె సురేంద్ర, డి చెంచు నిరంజన్, వై శ్రీనివాసులు మరో 9 మంది సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా అధ్యక్ష,కార్యదర్శులతో పాటు కార్యవర్గ సభ్యులకు శాలువాలు కప్పి, పూలమాలు వేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు రూరల్ జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కె సుబ్రమణి, కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, ఆర్యవైశ్య సంఘం నాయకులు కె వెంకటేశ్వర్లు,వై లక్ష్మీనారాయణ,జి జి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

కలవగుంట భరత్ రెడ్డి దాతృత్వం

విశాలాంధ్ర-తొట్టంబేడు: ప్రముఖ సంఘ సేవకులు, జాతీయ వినియోగదారుల హక్కుల కమిషను రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కలవగుంట భరత్ రెడ్డి మరోసారి తన దాతృత్వం చాటుకున్నారు. తొట్టంబేడు మండలం రాంబట్లపల్లెలో పది రోజులుగా తాగునీటి సమస్య ఉండటంతో గ్రామస్థులు కలవగుంట భరత్ రెడ్డి దృష్టికి తీసుకు వచ్చారు. ఇందుకు స్పందించిన భరత్ రెడ్డి రాంబట్లపల్లెలోని 55 కుటుంబాల వారికి ప్రత్యేక వాహనం ద్వారా శుద్ధ జలం పంపారు. దీంతో రాంబట్లపల్లె వాసులు హర్షం వ్యక్తం చేశారు. శుద్ధ జలం పంపిన కలవగుంట భరత్ రెడ్డికి వారు కృతజ్ఞతలు తెలియచేశారు. అధికారులు ఇకనైనా స్పందించి రాంబట్లపల్లెలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

టీటీడీ కాలేజీలే నెంబర్ వన్ గా ఉండాలి

- అధ్యాపకుల శిక్షణలో టీటీడీ డీఈఓ

విశాలాంధ్ర - తిరుపతి సిటీ: టీటీడీకి చెందిన కాలేజీలే అన్ని అంశాల్లో నెంబర్ వన్ గా ఉండేలా అధ్యాపకుల పనితీరు ఉండాలని టీటీడీ డీఈఓ ఎం.భాస్కర్ రెడ్డి అన్నారు. తిరుపతిలోని శ్వేత శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో టీటీడీ డిగ్రీ కళాశాలల అధ్యాపకులకు సోమవారం ఒకరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన టీటీడీ విద్యాశాఖాధికారి మాట్లాడుతూ అధ్యాపకులు శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని, కళాశాలలను మరింత ఉన్నతికి తీసుకెళ్లాలని సూచించారు. ఇదే కార్యక్రమంలో పాల్గొన్న జాతీయస్థాయి శిక్షకులు ఎం.నాగరాజు మాట్లాడుతూ త్వరలో టీటీడీ కళాశాలలు కొన్ని అటానమస్ గా మారబోతున్నాయని, ఇందుకోసం అనుసరించాల్సిన విధానాలను తెలుసుకోవాలని చెప్పారు. అదేవిధంగా న్యాక్ గుర్తింపు కోసం మన బలాలు, బలహీనతలు, అవకాశాలు, ప్రతిబంధకాలను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్వేత డైరెక్టర్ ఎ.ప్రశాంతి, విద్యాశాఖ సలహాదారు మోహన్ కుమార్ రెడ్డి, కళాశాలల ప్రిన్సిపాల్స్ మహదేవమ్మ, నారాయణమ్మ, వేణుగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు స్విమ్స్ విద్యార్థులకు మోటివేషనల్ టాక్

విశాలాంధ్ర - తిరుపతి సిటీ: స్విమ్స్ మెడికల్ యూనివర్శిటి పరిధిలోని మహిళా వైద్య కళాశాల విద్యార్థినిలకు మహతి ఆడిటోరియంలో బుధవారం(రేపు) ఉదయం 10 గంటలకు మోటివేషనల్ టాక్ నిర్వహించనున్నారు. ఇందులో టీటీడీ కార్యనిర్వాహకాధికారి ఎ.వి.ధర్మారెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగిస్తారు. శ్రీ పద్మావతి మహిళా వైద్యకళాశాల వైద్య విద్యార్థినిలను ఉద్దేశించి ప్రేరణాత్మక చర్చ (మోటివేషనల్ టాక్) నిర్వహించనున్నట్లు మెడికల్ సూపరింటెండెంట్ డా. రామ్ తెలిపారు. అలాగే ఈ కార్యక్రమానికి టిటిడి జె.ఇ.ఓ(వైద్యం, విద్య) సదా భార్గవి, స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డా. ఆర్.వి. కుమార్ లు హాజరు కానున్నారు.

నిత్యాన్నదానానికి కూరగాయలు వితరణ

విశాలాంధ్ర- శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వర ఆలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదానానికి సోమవారం హైదరాబాదుకు చెందిన ఎన్. వరప్రసాద్ అనే భక్తుడు 750 కిలోల సొరకాయలు, 200 గోంగూరు కట్టలు వితరణగా ఇచ్చారు. ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు వీటిని స్వీకరించారు. దాతకు కృతజ్ఞతలు తెలియచేసి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వచనం ఇచ్చారు. స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

నెలాఖరులోగా పన్నులు చెల్లించండి:కమిషనరు

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: అపరాధ రుసుం లేకుండా ఈ నెల 30వ తేదీలోగా పన్ను చెల్లించాలని శ్రీకాళహస్తి పురపాలక సంఘం కమిషనరు రమేష్ బాబు కోరారు. ఈ మేరకు ఆయన సోమవారం పురపాలక సంఘం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఇల్లు, కొళాయి, ఖాళీ జాగా పన్నులు ఇంకా చాలా మంది చెల్లించాల్సి ఉందన్నారు. వీరు ఈ నెల 30వ తేదీలోగా చెల్లించక పోతే వచ్చే నెల 1వ తేదీ నుంచి వడ్డీ చెల్లించాల్సి ఉంటుందన్నారు. ప్రజలు ఇది గమనించి వడ్డీ లేకుండానే సకాలంలో పన్ను చెల్లాంలని ఆయన కోరారు. ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించి పురపాలక సంఘం అభివృద్ధికి సహకరించాలని రమేష్ బాబు విజ్ఞప్తి చేశారు.

ఎంప్లాయిబిలిటీ స్కిల్స్‌పై విద్యార్థులకు వర్క్ షాప్

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి : ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల శ్రీకాళహస్తి నందు విద్యార్థులకు ఎంప్లాయిబిలిటీ స్కిల్స్‌పై వర్క్ షాప్ ను సోమవారం ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ తరపున నాంది ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో మాస్టర్ ట్రైనర్స్ స్థాయిలో మస్తాన్, రామకృష్ణల ఆధ్వర్యంలో వారం రోజులపాటు వర్క్ షాప్ జరుగనుంది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.రాజశేఖర్ మాట్లాడుతూ కేవలం తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు మాత్రమే ఈ అవకాశం కలదని, ఈ వర్క్ షాప్ ద్వారా విద్యార్థులు వివిధ రకాల వ్యాపార సంస్థలలో హెచ్ఆర్ గా ఎలా రాణించగలరు, ఇంటర్వ్యూ ఎలా చేయగలరు, కమ్యూనికేషన్ స్కిల్స్, సాఫ్ట్ స్కిల్స్, అనలిటికల్ స్కిల్స్ ఎలా పెంపొందించుకోగలరనే పలు విషయాలు తెలుసుకోవచ్చని విద్యార్థులకు తెలియజేశారు. ఈ అవకాశమును విద్యార్థులు అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు డాక్టర్ బి.రాజశేఖర్, ఐక్యూఏసి కోఆర్డినేటర్ డాక్టర్ పి.మాలతి, గాబ్రియల్ తదితరులు పాల్గొన్నారు.

ఫిష్ ఆంధ్ర అవుట్లెట్ ప్రారంభం

విశాలాంధ్ర- కోట : కోట పట్టణంలో సోమవారం నూతనంగా ఏర్పాటు చేసిన ఫిష్ ఆంధ్ర అవుట్లెట్ దుకాణాన్ని వైసీపీ రాష్ట్ర కార్యదర్శి పేర్నాటి శ్యాం ప్రసాద్ రెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా తాహసిల్దార్ పద్మావతి,ఎంపీడీవో భవాని,మత్స్యశాఖ అధికారులు ఫిష్ ఆంధ్ర అవుట్లెట్ దుకాణాన్ని సందర్శించి నిర్వాహకులకు పలు సూచనలు అందజేశారు.కోటపట్టణ పరిధిలోని ప్రజలకు ఈ ఫిష్ ఆంధ్ర అవుట్లెట్ ద్వారా తక్కువ ధరకు నాణ్యమైన మత్స్య సంపద అందుబాటులోకి వచ్చిందన్నారు.ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో ఫిష్ ఆంధ్ర అవుట్లెట్ లను ఏర్పాటుకు చర్యలు తీసుకోవటం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో వైకాపా కార్యకర్తలు పాల్గొన్నారు.